
BALA CHELIMI

BALA




DEC 2025

DEC | DEC

₹40

జనవరి – 2026

PRGI Regn. No. 52828/1992

# బాల చెలిమి

పిల్లల వికాస పత్రిక

# BALA CHELIMI

Telugu Children's Monthly Magazine

సంపుటి : 35 • సంచిక : 4




JANUARY - 2026

Editor : Er. VEDAKUMAR MANIKONDA

A PUBLICATION OF CHILDREN'S EDUCATIONAL ACADEMY, HYDERABAD, TELANGANA



## JANUARY 2026

The Buddhist sermons of spiritualism were gracefully portrayed by our students depicting Serenity, Mindfulness and Peace on the occasion of the 45th Annual Day Celebrations of Oxford Grammar High School.


**Oxford** Grammar High School

#Street No. 13, Himayathnagar, Hyderabad
Ph : 040 2763 6214, +91 99590 20512
www.oxfordgrammarschool.com


ogs JUNIORS

45 YEARS OF MERITORIOUS PERFORMANCE

| Sun | Mon | Tue | Wed | Thu | Fri | Sat |
|---|---|---|---|---|---|---|
| | | | | 1 | 2 | 3 |
| 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 |
| 11 | 12 | 13 | 14 | 15 | 16 | 17 |
| 18 | 19 | 20 | 21 | 22 | 23 | 24 |
| 25 | 26 | 27 | 28 | 29 | 30 | 31 |
| | | | | | | |

**Important Dates**

- 1 Jan - New Year
- 13 Jan - Bhogi
- 14 Jan - Makar Sankranti
- 15 Jan - Kanuma
- 26 Jan - Republic Day

NOTES :


**Do not let behavior of others destroy your inner peace.**

Printed at : Deccan Press, Azamabad, Hyderabad-20, Ph : 90599 50055

# బాలచెలిమి

పిల్లల వికాస పత్రిక


| సంపుటి: Volume: 35 | సంచిక : Issue : 4 | హైదరాబాద్ Hyderabad | జనవరి January | పేజీలు Pages 52 | రూ. ₹. 40 |
|---|---|---|---|---|---|










లోపలి పేజీల్లో.......




| | | |
|---|---|---|
| పుస్తకాల జాతర... | మణికొండ వేదకుమార్. | 5 |
| ప్రపంచ ప్రఖ్యాత జీవరసాయన శాస్త్రవేత్త హరగోవింద్ ఖొరానీ (సైంటిస్ట్) | జుగాష్‌విలి | 6 |
| ప్రశ్నలతో (వరల్డ్ లాజిక్ డే) | డా. నీరజ అమరవాది | 7 |
| బొమ్మలేద్దామా... | | 8 |
| వేదాంగి కులకర్ణి | షీరోస్-256 | 9 |
| గేయాన్ని చార్టులపై రాసి అక్షరాన్ని గుర్తింపజేయడం (అక్షరం) | డా॥ జనపాల శంకరయ్య | 10 |
| అప్రమత్తం (కథ) | ఆవుల చక్రపాణి యాదవ్ | 11 |
| వేమన పద్యాలు | | 11 |
| బంగారు పంట (కథ) | పి. కార్తీక్ | 13 |
| స్పూనులో నిమ్మకాయ (ఆట).. | చిన్ననాటి ఆటలు-జ్ఞాపకాల మూటలు | 14 |
| బంగారు మర్రి - 8 (సీరియల్) | పైడిమర్రి రామకృష్ణ | 15 |
| లాజికల్ రీజనింగ్& ఆల్ఫాబెట్ టెస్ట్ | బాలచెలిమి డెస్క్ | 16 |
| నత్త పిల్ల స్నేహితులు (కథ) | ప్రణయజ | 17 |
| ధూళికట్ట (యాత్ర) | దేశరాజు శ్యాంసుందర్‌రావు - స్థపతి | 19 |
| ప్రదక్షిణాలు చేసే పాము (సైన్స్) | డాక్టర్ మహీధర నళినీ మోహన్ | 20 |
| లైట్ తీస్కో... (లఘునాటిక) | డా. సమ్మెట విజయ | 21 |
| గురువును దిద్దిన శిష్యుడు (సైన్స్ వెన్నెల-15) | డా. నాగసూరి వేణుగోపాల్ | 24 |
| బత్తాయి చెట్టు (చెట్టు - చేమ) | కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి | 25 |
| మన రాజ్యాంగం (కార్టూన్) | జుగాష్ విలి | 26 |
| టీ20ల్లో నెంబర్ వన్ బౌలర్‌గా దీప్తి శర్మ చరిత్ర సృష్టించిన భారత మహిళా ఆల్‌రౌండర్ (స్పోర్ట్స్) | బాలచెలిమి డెస్క్ | 28 |
| పర్యావరణాన్ని కాపాడుదాం! (కథ) | యస్. మధు కిరణ్ | 29 |
| నక్క - యుద్ధభేరి కథ | పంచతంత్ర కథ | 30 |
| నీలం రాయి (అనువాద కథ) | అనిల్ బత్తుల | 31 |
| సంపూర్ణ స్వాతంత్ర్యం గణతంత్ర దినోత్సవం (పండుగ) | డా. అమ్మిన శ్రీనివాసరాజు | 33 |

బౌద్ధ మతం - నాగార్జునుడు (చరిత్ర పాఠాలు-11)................................ డా. ద్యావనపల్లి సత్యనారాయణ .......... 35
ఊc... తొందరగా (పాట)... ......................................................... గంగదేవు యాదయ్య......................... 36
బంగారు కలలు - వెండి చిరునవ్వు ................................................. ................................................ 36
ఆపిల్ పండుతో గురుత్వాకర్షణ సూత్రం ........................................... బాల కథా సౌరభం ........................ 37
5తో అద్భుతం (మాథ్స్ ట్రిక్స్) ......................................................... అంకెల మామయ్య చంద్రయ్య ............ 38
చెలిమి క్లబ్. ............................................................................... బాలచెలిమి ...................................... 38
కృత్రిమ మేధస్సు (విద్య) .............................................................. లత .............................................. 39
నేర్చుకుందామా.......................................................................... ................................................ 42
కలం-చెలిమి ............................................................................. ................................................ 42
భారత స్వాతంత్ర్య సమరయోధులు (జి.కె.) ........................................ బాలచెలిమి డెస్క్ .......................... 43
ఆ ఊరికి ఈ ఊరెంత దూరమో, ఈ ఊరికి ఆ ఊరంతే దూరం ..................... కాశీ విశ్వనాథం పట్రాయుడు ............. 45
వన్యప్రాణుల మాంత్రిక రాజు సుమత్రన్ పులి ........................................ సచిన్ కోత్వాల్ ............................ 46
దాట్ల హైస్కూల్‌లో బాలచెలిమి గ్రంథాలయ ప్రారంభం .............................. కె. కృష్ణయ్య.................................. 47
కన్నుల పండుగలా జరిగిన బాలచెలిమి జాతీయ కథల పోటీ విజేతలకు.............. గరిపెల్లి అశోక్ ............................ 48
సృజనకారుల మధ్య బాలచెలిమి జాతీయ కథల పోటీలో ఎంపికైన కథల సంపుటాలు... గరిపెల్లి అశోక్ ............................ 49
న్యాయపతి రాఘవరావు (వ్యక్తిత్వం) ................................................ సువేగా .......................................... 50


# చెలిమి లేఖలు

బాల చెలిమి నిర్వాహకులకు నా నమస్కారాములు. నేను రాసిన “మంచి మార్పు” అనే కథను అక్టోబర్ బాల చెలిమిలో అచ్చువేసినందుకు ధన్యవాదములు. నేను ఈ కథను రాయడానికి మా పాఠశాల ఉపాధ్యాయులు సహకరించారు. వారికి నా ధన్యవాదములు. బాల చెలిమి ప్రోత్సాహనికి సదా కృతజ్ఞతలు.

**- బి శ్రీచరిత,** 10వ తరగతి

బాలచెలిమి జాతీయ కథల పోటీ-2025లో నా కథను ఉత్తమ కథగా ఎంపిక చేసి, 'సంకలనం'లో ప్రచురిస్తున్నందుకు మీకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుకొంటున్నాను. ఈ సందర్భంగా అందజేయనున్న బహుమతి నగదును బాలచెలిమి చందాగా స్వీకరించగలరని వినమ్రంగా తెలియజేస్తున్నాను.

**- ఓట్ర ప్రకాష్ రావు,** తిరుత్తణి

బాలచెలిమి మ్యాగజైన్ పిల్లలలో చదవాలనే ఆసక్తిని, సృజనాత్మకతను పెంపొందించే ఉత్తమ పత్రిక. పాఠ్యాంశాలతో పాటు జీవిత నైపుణ్యాలను అందించే రచనలు ఇందులో ఉన్నాయి. ప్రతి సంచికలో నాణ్యమైన కథలు, ఉపయోగకరమైన విషయాలు ఉంటాయి. బాల రచయితలకు ప్రోత్సాహం ఇచ్చే వేదికగా ఇది ప్రశంసనీయం. తెలుగు బాల సాహిత్యంలో బాలచెలిమికి ప్రత్యేక స్థానం ఉంది.

**- ప్రజ్ఞాన్ తేజ,** కరీంనగర్

బాలచెలిమి పత్రిక పిల్లల ప్రపంచంలో విభిన్న రచనా శైలులు, భావప్రధాన కథలు, సృజనాత్మక ఆలోచనలతో కూడిన రచనలు ప్రచురిస్తూ, బాలల మేధస్సు మరియు వ్యక్తిత్వ వికాసానికి దోహదపడే ఒక సమగ్ర సాహిత్య వేదికగా నిలుస్తోంది.

**- శ్రీకాంత్,** విజయవాడ

*Cover Picture*
**MIHIRA**
Medals won:
Swimming freestyle - Gold medal
Running (60 m) - Gold medal
Hurdle Race - Gold medal
Skating (50 m) - Silver medal

*బొమ్మలు:*
**కూరెళ్ల శ్రీనివాస్,**
m : 98495 43728





**సంపాదకులు : మణికొండ వేదకుమార్**

BALA CHELIMI
**"CHANDRAM"** 3-6-712/2, St.No.12,
Himayatnagar, Hyderabad - 500 029.
e-mail : edit.chelimi@gmail.com, www.balachelimi.com
Mob: 98480 44713

# పుస్తకాల జాతర...

పిల్లలూ....

మీకూ, మీ స్నేహితులకీ, అమ్మా నాన్నలకీ, మీ టీచర్స్‌కీ నూతన సంవత్సర మరియు సంక్రాంతి శుభాకాంక్షలు. ఇది పండుగల కాలం. నిన్న క్రిస్మస్. రేపు సంక్రాంతి. ఈ నడుమ హైదరాబాద్ నగరంలో ఎన్నడూ లేనంతగా పుస్తకాల జాతర. శని, ఆదివారాల్లో పోటెత్తిన యువతరం. అమ్మా నాన్నలతో పుస్తక విహార యాత్రకి తరలి వచ్చిన పిల్లలు. వీళ్లని చూస్తుంటే భవిష్యత్ తరాల పట్ల ఆశ. పుస్తకానికి, పుస్తక పఠనానికి డోకా లేదన్న భరోసా. ఎన్ని స్టాల్స్... ఎన్ని పుస్తకాలు.. జీవితంలోని అన్ని కోణాలనూ, భావోద్వేగాలనూ విశ్లేషించి, వివరించే పుస్తకాలు.

ఈసారి ప్రత్యేకత యువతరపు ఉత్తేజం. యువతరం రచయితలు, యువతరం పబ్లిషర్స్ ప్రత్యేకంగా నిర్వహిస్తున్న స్టాల్స్ అన్నీ ఉద్వేగపు యువతరంతో తొణికిసలాడుతున్న రంగు రంగుల పూలతోటలే. ఒకరికొకరు కరచాలనాలు, పలకరింపులూ, ఆలింగనాలూ, పుస్తకాలపై సంతకాలూ, ఫోన్ నెంబర్స్ యిచ్చిపుచ్చుకోవడాలూ, ఫేస్‌బుక్ ఫ్రెండ్స్ ఒకరినొకరు గుర్తు పట్టుకోవడాలూ, ఫోటోలు తీసుకోవడాలూ.. బుక్‌ఫెయిర్‌లోకి అడుగు పెట్టగానే నీలాకాశంలో నక్షత్రాలను రెండు చేతులతో వెనక్కి తోసుకుంటూ గాలిలో తేలిపోతున్న ఆనందానుభూతి.

ఈ ఆనందంలో తలమునకవుతుండగానే... మరో జాతర... కథల జాతర... పిల్లల కథల జాతర. జాతీయ బాలచెలిమి కథల పోటీలో విజేతల విజయ విహారం. డిసెంబర్ 22 ఆదివారం రోజంతా హిమాయత్‌నగర్ ఆక్స్‌ఫర్డ్ స్కూలు ఆవరణమంతా విరజిమ్మిన విరజాజుల పరిమళం. విజేతలైన నలభైమందికి బహుమతీ ప్రదానం. న్యాయనిర్ణేతలకు, చిత్రకారులకు, సహకరించిన అందరికీ గౌరవ సత్కారం... ఇది బాలచెలిమి కుటుంబ సభ్యుల ఆత్మీయ కలయిక. రియాజ్‌గారు, రావి శారదగారు పిల్లలలో ఉత్తేజాన్నీ, స్ఫూర్తినీ, దిశనూ, దశనూ ప్రేరేపించే అద్భుత ప్రసంగాలూ... తన అమ్మా నాన్నలతోనో, టీచర్స్‌తోనో బహుమతి అందుకోవడానికి సుదూర గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన చిన్నారులూ... ఇంత పెద్ద నగరంలో తన బిడ్డకు జరుగుతున్న సత్కారాన్ని చూస్తూ ఆనందంతో కళ్ళ నిండా నీళ్ళు నింపుకున్న తల్లిదండ్రులూ.

ఇలా వాళ్ళని చూస్తుంటే మన కళ్ళు చెమ్మగిల్లకుండా ఎలా ఉంటాయి...

ఆ తెల్లారి డిసెంబర్ 23 సాయంత్రం బుక్‌ఫెయిర్‌లో కొంపెల్లి వెంకట్‌గౌడ్ సభా వేదికపై శాంతసిన్హా, ఏనుగు నరసింహారెడ్డి గార్ల చేతుల మీదుగా పిల్లలు రాసిన పిల్లల కథలు నాలుగు సంపుటాలూ, పెద్దలు రాసిన పిల్లల కథలు మూడు సంపుటాలూ, యువత రాసిన పిల్లల కథలు సంకలనమూ మొత్తం ఎనిమిది పుస్తకాలు ఆవిష్కరించుకోవడం బాలసాహితీ వికసనంలో ఒక మైలు రాయి.

ఇక ముందు కూడా చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ, బాలచెలిమి తమ బాధ్యతను బాధ్యతగా నెరవేర్చగలమనే నమ్మకంతో...



మీ

వేదకుమార్.యం

(మణికొండ వేదకుమార్)

ఎడిటర్ బాలచెలిమి



సైంటిస్ట్

# ప్రపంచ ప్రఖ్యాత జీవరసాయన శాస్త్రవేత్త హరగోవింద్ ఖొరానా



హరగోవింద్ ఖొరానా ప్రపంచ ప్రఖ్యాత జీవ రసాయన శాస్త్రవేత్త. భారతీయ మూలాలున్న అమెరికన్ పౌరుడు. అవిభక్త భారతదేశంలోని పంజాబ్ రాష్ట్రంలోని రాయపూర్‌లో 1922 జనవరి 9న జన్మించారు. పంజాబ్ యూనివర్సిటీలో బిఎస్సీ, ఎమ్ఎస్సీ చదివారు. ఇంగ్లాండ్ లోని లివర్‌పూల్ యూనివర్సిటీలో డాక్టరేట్ చేసారు.

ప్రొటీన్ నిర్మాణానికి DNA/RNA లోని న్యూక్లియోటైడ్‌లు ఏ విధంగా ఇలా మూడు మూడు అక్షరాల కోడాన్‌లుగా కలిసి అమినో ఆమ్లాలను నిర్ణయిస్తాయో చూపుతూ జన్యుకోడ్‌ను పరిగణించే ప్రధాన ప్రయోగాలు చేసారు. జన్యువులోని జెనెటిక్ కోడ్‌ను వివరించి, ప్రొటీన్ సంశ్లేషణలో దాని పాత్రను నిర్ధారించారు. ఈ పరిశోధనలు జీన్‌థెరపీ, బయోటెక్నాలజీకి మార్గం సుగమం చేసాయి.


బ్రిటీష్ కొలంబియా యూనివర్సిటీ, విస్కానిన్ – మాడిసన్ విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా పని చేసారు. 1970ల నుంచి 2007 వరకు మసాచుసెట్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఐటి)లో ప్రొఫెసర్‌గా పని చేసారు.

1966లో అమెరికా పౌరసత్వం పొందారు. శాస్త్రీయ విద్య, అవకాశాల విస్తరణకోసం ఆయన పేరుతో 'ఖొరానా ప్రోగ్రామ్' కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

1968లో మార్షల్ నిరెన్‌బర్గ్, రాబర్ట్ హాలీతో కలిసి ఫిజియాలజీ లేదా మెడిసన్‌లో నోబెల్ బహుమతిని పంచుకున్నారు. 1968లో లెస్టర్ పురస్కారం, 1987లో యుఎస్ఎ నేషనల్ మెడల్ ఆఫ్ సైన్స్ వంటివి కూడా లభించాయి. భారత ప్రభుత్వం పద్మవిభూషణ్‌తో గౌరవించుకుంది. అల్బర్ట్ లస్కర్ అవార్డు, విల్లార్డ్ నీబ్స్ వంటి అనేక అంతర్జాతీయ పురస్కారాలు అందుకున్నారు.

హరగోవింద్ 2011 నవంబర్ 9న మరణించారు. జన్యుశాస్త్రం, బయోటెక్నాలజీ రంగాల్లో హరగోవింద్ కృషి ఆధారంగా జెనెటిక్ ఇంజనీరింగ్‌లో పరిశోధనలు కొనసాగుతూనే ఉన్నాయి.

– జుగాష్‌విలి
బాలచెలిమి డెస్క్, m : 83094 52998




# ప్రశ్నలతో పయనం

హలో.. పిల్లలందరికీ 2026 ఆంగ్ల సంవత్సర శుభాకాంక్షలు. అన్నట్లు సంవత్సరానికి ఎన్ని రోజులు, ఎన్ని వారాలు, ఎన్ని నెలలు?.. ఆలోచిస్తున్నారా!. ఈ ఆలోచనాశక్తి వల్లే మనుషులు ఎంతో అభివృద్ధి చెందారు. ఆలోచనలు దాని ద్వారా వచ్చే తార్కిక ప్రశ్నలు, సమాధానాల వల్లే మనం ఎన్నో కొత్త విషయాలను, వస్తువులను కనిపెట్ట గలిగాము. ఆలోచించే సామర్థ్యం, తర్కం మానవజాతి యొక్క గొప్ప లక్షణం. తర్కం అనే పదాన్ని చాలా వరకు తత్వశాస్త్ర పరంగా ఆలోచిస్తాము. కానీ విజ్ఞానం, శాస్త్ర సాంకేతికతల అభివృద్ధికి తర్కం చాలా అవసరం. తర్కం యొక్క ఆవశ్యకత గురించి సామాన్య ప్రజలలో అంతగా అవగాహన లేదని చెప్పవచ్చు. ముఖ్యంగా విద్యార్థులకు ఇది చాలా అవసరం. తర్కం అంటే కేవలం ప్రశ్నించటం మాత్రమే కాదు. విమర్శనాత్మకంగా ఆలోచించే సామర్థ్యాన్ని అభివృద్ధి చేయడం. జ్ఞానాన్ని అభివృద్ధి చేయడానికి తర్కం యొక్క ప్రాముఖ్యతని తెలియజేయడానికి యునెస్కో జనవరి 14న వరల్డ్ లాజిక్ డే ని జరుపుకోవాలని 2019న ప్రకటించింది. దీనికి "ఇంటర్నేషనల్ కౌన్సిల్ ఫర్ ఫిలాసఫీ అండ్ హ్యూమన్ సైన్సెస్ (CIPSH)" కూడా తన మద్దతును తెలియజేసింది.

ప్రతి సంవత్సరం జనవరి 14న ప్రపంచ లాజిక్ వార్షిక దినోత్సవ సందర్భంగా అంతర్జాతీయంగా పరిశోధన, బోధనలలో లాజిక్ ప్రోత్సహిస్తూ, తర్కం యొక్క అవసరాన్ని లోకానికి తెలియజేస్తారు.

"Logic is the beginning of wisdom, not the end". - Leonard Nimoy.

మనకు తెలియకుండానే తరచూ మనం లాజిక్‌ని రకరకాలుగా వాడుతూ ఉంటాము. ఉదా:- "ఏనుగు, ఎలుక", వీటిలో ఏది పెద్దది అంటే, వెంటనే ఏనుగు అని చెబుతాము కదా! ఎలా చెప్పగలిగాము. మనకు తెలియ కుండానే ఆ రెండు జంతువుల ఆకారాలను గుర్తు తెచ్చుకొని, పోల్చుకొని ఒక నిర్ణయానికి వస్తాము. ఇది ప్రాథమిక స్థాయిలోని తర్కం అని అర్థం చేసుకోవచ్చు. అలాగే మరో ఉదా:- ఒక రైతుకు కొన్ని కోళ్లు, మేకలు ఉన్నాయనుకోండి. వాటిలో 22 తలలు, 68 కాళ్లు ఉన్నాయి. రైతు వద్ద ఎన్ని

కోళ్లు, మేకలు ఉన్నాయో చెప్పండి. వెంటనే మేకకి ఎన్ని కాళ్లు ఉంటాయని లెక్క వేసుకుంటాము. అలాగే కోడికి ఎన్ని కాళ్లు ఉంటాయో అని ఆలోచించి, తలలకి, కాళ్లకి లెక్క సరిపోయేట్లు చూసుకుంటే సమాధానం వస్తుంది. ఇంతకీ మీకు సమాధానం తెలిసిందా. మీరనుకొన్నట్లు రైతు దగ్గర 10 కోళ్లు, 12 మేకలు ఉన్నాయి. ఇది కూడా ఒక రకంగా మన బుద్ధికి పదును పెట్టే పజిల్ లేదా లాజిక్, తర్కం అని చెప్పుకోవచ్చు. లాజికల్ గా ఆలోచించడం వల్ల మన మనస్సు, బుద్ధి కొత్త సమస్యలను పరిష్కరిస్తూ, గొప్ప గొప్ప ఆవిష్కరణలకి ప్రాణం పోస్తుంది. తర్కం అంటే కేవలం వాదన, పరిష్కారాలు మాత్రమే కాదు. తార్కికంగా ఒక ఆలోచన నుండి మరొక ఆలోచనను ఎలా అభివృద్ధి చేయాలో తెలుసుకోవచ్చు. ముఖ్యంగా కంప్యూటర్ ప్రోగ్రామింగ్‌కి ఈ లాజికల్ థింకింగ్ చాలా అవసరం. AI సాఫ్ట్‌వేర్ కూడా లాజిక్ ఆధారంగానే అభివృద్ధి చేయబడుతోంది. ఒక రకంగా ఏ శాస్త్రానికైనా లాజిక్ చాలా అవసరం. లాజికల్ థింకింగ్‌కి చిన్నప్పటి నుండి పజిల్స్, వర్డ్ గేమ్స్, చదరంగంతో పాటు పాతకాలం ఆటలు అష్టచెమ్మా, వైకుంఠపాళి ఆటలు ఎంతగానో ఉపయోగ పడతాయి.

జనవరి 14 'వర్ల్డ్ లాజిక్ డే' సందర్భంగా విద్యతో పాటు విజ్ఞానశాస్త్ర పురోగతికి తర్కం యొక్క ప్రాధాన్యతని ప్రజలందరికీ తెలియజేయడానికి రకరకాల సదస్సులను నిర్వహిస్తారు. పాఠశాలల్లో పిల్లలలో సైన్స్ పట్ల నమ్మకాన్ని, అభిరుచిని పెంచడానికి సైన్స్ ఫెయిర్, సైన్స్ ఎక్స్‌పో లని నిర్వహిస్తారు. పిల్లలూ మీరంతా చిన్నప్పటి నుండే ధైర్యంగా ప్రశ్నించటం అలవాటు చేసుకోండి. లాజికల్‌గా ఆలోచించండి. అనుమానాలు వస్తే పెద్దలను, టీచర్లను అడగండి. మీలోని పరిశోధకులను నిద్ర లేపండి. పిల్లలు తలుచుకుంటే చేయలేనిది ఏమీ ఉండదు. కొత్త సంవత్సరంలో కొత్త ఆవిష్కరణలకి శ్రీకారం చుడదాం.

"Logic is the technique by which we add conviction to truth – Jean de la Bruyere".

– డా. నీరజ అమరవాది
m : 9849160055

## బొమ్మలేద్దామా...



యోక్షిత్, 4వ తరగతి, 9 సంవత్సరాలు, తెనాలి.

చందదారులుగా చేరండి! బాల చెలిమి చందదారులను చేర్పించండి!

SCAN & PAY

'యం.వేదకుమార్ సంపాదకత్వంలో వెలువడుతున్న 'బాల చెలిమి' పిల్లల మాసపత్రిక బాలబాలికలకు చేరడంలో తల్లిదండ్రుల, ఉపాధ్యాయ, పాఠశాల నిర్వహకుల, మేధావుల అమూల్య సహకారాన్ని కోరుతున్నాం. చందదారులుగా చేరడంతోపాటు తమకు తెలిసినవారిని చందదారులుగా చేర్పించాల్సిందిగా అభ్యర్థిస్తున్నాం.

**మా చిరునామా :**
BALA CHELIMI
"CHANDRAM" 3-6-712/2,
St.No. 12, Himayatnagar
Hyderabad - 500 029.
Mob: 9030626288
E-mail:desk.chelimi@gmail.com,
www.balachelimi.com

**చందా వివరాలు :**
విడి ప్రతి : రూ. 40
వార్షిక చందా : రూ. 400
2 సం॥లకు : రూ. 750
'బాల చెలిమి' పేరిట నగదు, చెక్ లేదా ఆన్‌లైన్ రూపంలో చందామొత్తం చెల్లించవచ్చు.

**ACCOUNT DETAILS :**
Bank Name : Canara Bank
A/C No. : 30101010003714
Branch : Ashoknagar, HYDERABAD.
IFSC Code : CNRB0013010

# వేదాంగి కులకర్ణి


## సైకిల్ మీద భూగోళాన్ని చుట్టి వచ్చిన అతి పిన్న వయస్కురాలు

వేదాంగి కులకర్ణి (1998- ) భారతీయ సాహసికురాలు, రచయిత, కథకురాలు, సుదూర ప్రయాణాలు చేసే సైకిలిస్ట్. యునైటెడ్ కింగ్‌డమ్, స్విట్జర్లాండ్‌లో చదువుతున్నప్పుడు 1400 కిలోమీటర్లకు పైగా సైకిల్ తొక్కారు. సైక్లింగ్ పట్ల తన ప్రేమను అర్థం చేసుకుని, ఆ ప్రయాణాన్ని కొనసాగించారు. ఈ అనుభవం ఆమెకు అనేక విషయాలు తెలిసేలా చేసింది. దీంతో భూగోళాన్ని చుట్టి రావాలనే ఆలోచనతో ముందుకు వెళ్లారు.

ఆస్ట్రేలియా పెర్త్‌లో తన సైకిల్ ప్రయాణాన్ని వేదాంగి ప్రారంభించారు. 159 రోజుల్లో 14 దేశాలు (సుమారు 29,000 కి.మీ.) చుట్టి వచ్చారు. ప్రయాణించిన ప్రతి చోటుకు తనకు అవసరమైన వస్తువులను, సైక్లింగ్ సామాగ్రిని వేదాంగి వెంట తీసుకుని వెళ్లారు. ఈ ప్రయాణంలో ఆమెకు అనేక మధుర అనుభూతులతో పాటు, ప్రమాదకర ఘటనలు కూడా ఎదురయ్యాయి. గ్రిజ్లీ ఎలుగుబంటి ఆమెను వెంబడించింది. దొంగలు కత్తితో బెదిరించి ఆమె వస్తువులు దోచుకున్నారు. వేదాంగి కొన్నిసార్లు ఆసుపత్రి పాలయ్యారు.

అన్ని ప్రతికూలతలను అధిగమించి వేదాంగి విజయం సాధించారు. 2018 డిసెంబర్‌లో ఆమె ప్రపంచాన్ని చుట్టి వచ్చిన అతి పిన్న వయస్కురాలిగా నిలిచారు. సాహసోతపేత పనికి, సంకల్పానికి, సవాళ్లను అధిగమించే సామర్థ్యానికి వేదాంగి కులకర్ణి మారు పేరు. అడ్డంకులు బద్దలు కొట్టి, సామాజిక కట్టుబాట్లతో సంబంధం లేకుండా తాము కన్న కలలను ఎవరైనా సాకారం చేసుకోవచ్చనే సందేశాన్ని ఆమె ప్రస్థానం అందిస్తుంది.

– 'షీరోస్-256 ఇన్‌స్పైరింగ్ వుమెన్ ఫ్రమ్ ఇండియా' నుండి....




**మీకు తెలుసా?**

'ది అడ్వెంచర్ షెడ్' అనే పేరుతో వ్యాపారాన్ని వేదాంగి నిర్వహిస్తున్నారు. దీని ద్వారా సాహసాలు, సాహసయాత్రల ప్రణాళికలు తయారు చేస్తారు (కొన్నిసార్లు వాటికి నాయకత్వం వహిస్తారు).

# 1991 - ఆంధ్రప్రదేశ్ విద్యాపథకంలో - భాగంగా గేయాన్ని చార్టులపై రాసి అక్షరాన్ని గుర్తింపజేయడం- గుర్తించే అక్షరాన్ని ఎర్రని సిరాతో రాయడం





దండలు సీతారాములకు వేయండి
దండం బెడితె దయ జూపునులే
దవడ దంతం ఊడెను పాపాయికి
“దంతం” మొదటి అక్షర మేది? “ద” అక్షరం



ధవళ య తెల్లని ఆవుయని తెలుసా?
ధగధగమని ధరలో ధర్మము మెరిసెను
ధనిష్ట రోజున బీదలకు ధనము పంచుము
“ధనము” లో ముందున్న అక్షరమేది? “ధ” అక్షరం



నగరంలో నడక ఎంతో మేలు
నగిషీల నగలంటే ఆడవాళ్ళకు మోజు
నందన వనంలో పువ్వులు నవ్వాయి
“నందన వనంలో మొదటి అక్షరమేది? “న” అక్షరం



పడగ విప్పిన పామును చూశారా?
పడగపై కృష్ణుని పాదాలున్నాయా?
పంచమి పండుగను పాముకు పాలు పోశారా?
“పలక”లో ముందున్న అక్షరమే ముంది? “ప” అక్షరం



“ఫణి” యంటే పాము అని తెలుసా?
“ఫలములు” తింటే బలమని తెలుసా?
“ఫకీర్” అల్లా అంటూ తిరుగుతుంటడు తెలుసా?
“ఫలానా”లో ముందు ఏ అక్షరమే ముంది? “ఫ” అక్షరం

– డా॥ జనపాల శంకరయ్య
m : 8074727108

కథ

# అప్రమత్తం



నల్లమల అడవిలో ఒక పెద్ద పులి తన గుహలో హాయిగా నిద్రపోతున్నది. ఒక్కసారిగా పెద్ద శబ్దం. ఆ శబ్దానికి పులి ఉలిక్కిపడి లేచింది.

పెద్ద ఉరుము ఉరిమిందా? అనుకుంది. పిడుగు పడిన శబ్దమేమో? అని బయటకు వచ్చి తొంగి చూసింది. కానీ బయట వర్షం వచ్చే సూచనలేవీ కనిపించలేదు. అప్పుడే తెలతెల వారుతున్నది. లేత సూర్య కిరణాలు ఇంకా భూమిని చేరలేదు. పక్షులు ఆ శబ్దానికి గాబరాగా అరుస్తున్నాయి. కొన్ని జంతువులు వాటి పిల్లలు భయపడి కంగారుగా అటూ ఇటూ పరిగెడుతున్నాయి. ఏమైందో అర్థం కావడం లేదు. ఇంతవరకు అలాంటి శబ్దాన్ని ఎన్నడూ, ఏ జంతువూ వినలేదు. ఆ శబ్దం కొత్తగా, భయంకరంగా ఉంది.

ఆ శబ్దానికి కారణం తెలుసుకోవాలని ఒళ్ళు విరిచి నిద్రమత్తు వదిలించుకుంది పులి. మెల్లగా గుహలో నుంచి బయటకు కదిలింది. అటుగా పరుగెడుతున్న ఎలుగుబంటును పిలిచింది. ఎలుగుబంటు భయం భయంగా పులి దగ్గరకు వచ్చింది. "అంత పెద్ద శబ్దం ఎక్కడి నుంచి వచ్చింది. ఏమైంది" అని ప్రశ్నించింది పులి. "తూర్పు వైపు నుండి శబ్దం వినిపించినట్లుంది. ఆ శబ్దానికి నా చిన్న పిల్లలు భయపడి చెదిరిపోయాయి. వాటిని వెతుకుతూ వెళ్తున్నాను."అని తన పిల్లలు ఎక్కడ ఉన్నాయోనని పరిగెత్తింది అది.

అటూ ఇటూ బిత్తర చూపులతో పరుగెడుతున్న జింకను పిలిచింది పులి. భయంగా తన దగ్గరకు వచ్చింది జింక. జింకను శబ్దానికి కారణం అడిగింది. "శబ్దానికి కారణం నాకు తెలియదు. ఆ శబ్దంలో రాయి వచ్చి తగిలి మా మిత్రుడు గాయపడ్డాడు. వైద్యుడు కోతిని పిలుచుకుపోవడం కోసం పరుగెడుతున్నా"నని చెప్పి పరిగెత్తింది జింక.

ఇంకొంచెం ముందుకు కదిలింది పులి. బయలు ప్రదేశంలో సేదతీరుతున్న రామచిలుకను చూసింది. శబ్దానికి కారణం అడిగింది పులి.

"ఆ శబ్దమా! అమ్మో! భయంకరంగా ఉంది. శబ్దానికి రాళ్లు చాలా దూరం ఎగిరి పడ్డాయి. నేను కొంచెంలో తప్పించుకున్నాను. భయంతో ఇంత దూరం వచ్చాను" అంది రామచిలుక.

"అంత పెద్ద శబ్దం ఎవరు చేశారు" అడిగింది పులి. "మనుషులు" ఇక్కడ కొండల్లో ఏదో యురేనియం ఉందంట. కొండలను రసాయనిక పదార్థాలతో పేల్చివేస్తున్నారు." అంది రామచిలుక.

అడవి జంతువుల ఉనికికే ప్రమాదం ఏర్పడుతుందని అర్థమైంది పులికి. అడవి

జంతువులన్నింటినీ సమావేశపరిచింది. యురేనియం వలన పర్యావరణం నాశనం అవుతుంది. నీటిని కలుషితం చేస్తుంది. ఆ నీటిని ఎవరు తాగినా రోగాల బారిన పడతారు. తవ్వకాల వలన వెలువడే దుమ్ము కణాల్లోని యురేనియం పీల్చడం వల్ల ఊపిరితిత్తుల వ్యాధులొస్తాయి. దీర్ఘకాలిక రోగాలు చుట్టుకుంటాయి. మనం ఎలాగైనా ఈ విధ్వంసాన్ని ఆపాల"ని జంతువులన్నీ తీర్మానించుకున్నాయి.

సమయం చూసి ఒక్కసారిగా మానవ బృందంపై దాడి చేశాయి. ఆ దాడిలో చాలా జంతువులు గాయపడ్డాయి. మానవుల దగ్గర ఆయుధాలను చూసి జంతువులు కంగారు పడ్డాయి.

తమను తాము కాపాడుకోవడానికి అడవి జంతువులు యురేనియం తవ్వే సిబ్బందిపై దాడి చేశాయని ప్రజలందరికీ తెలిసింది.

అడవి జంతువులను విచక్షణా రహితంగా కాల్చారని, చాలా జంతువులు గాయపడ్డాయని పర్యావరణ పరిరక్షకులకు, జంతు ప్రేమికులకు తెలిసింది. అప్పటికే యురేనియం తవ్వకాలపై వ్యతిరేకత ప్రజల్లో ఉంది. ఈ జంతువుల సంఘటనతో మరింత అప్రమత్తమయ్యారు ప్రజలు.

నల్లమల ప్రాంత ప్రజలను అప్రమత్తం చేశారు. యురేనియం తవ్వకాల వలన కలిగే దుష్పరిణామాలను వివరించారు. తమ ప్రాణాలను పణంగా పెట్టైనా అడవిని రక్షించుకుంటామని దీక్ష బూనారు ప్రజలు. యురేనియం తవ్వకాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఉద్యమం జరిగింది. ప్రభుత్వం యురేనియం తవ్వకాలను నిలుపుదల చేసింది.

యురేనియం తవ్వకాల సిబ్బంది అక్కడి నుండి వెళ్లిపోయారు. జంతువులన్నీ విజయంతో సంబరాలు చేసుకున్నాయి. మనం కలిసిమెలిసి దాడి చేయడం వలన ఈ విషయం ప్రజలందరికీ తెలిసి వచ్చింది. వారు అప్రమత్తమయ్యారు వారితో పాటు మనలను కూడా రక్షించారు. ఇలాంటి సంఘటనలు జరిగినప్పుడు మన ఉనికిని మనం కాపాడుకోవాలని తీర్మానించుకున్నాయి జంతువులు.

– ఆవుల చక్రపాణి యాదవ్
కన్నమడకల గ్రామం, ఓర్వకల్లు పోస్ట్
కర్నూలు జిల్లా, ఆంధ్రప్రదేశ్ – 518010
m : 9963350973

శతకం


# వేమన పద్యాలు

**పూజ కన్న నెంచ బుద్ధి ప్రధానంబు**
**మాటకన్న నెంచ మనసు దృఢము**
**కులముకన్న మిగుల గుణము ప్రధానంబు**
**విశ్వదాభిరామ వినురవేమ!**

తాత్పర్యం : పూజ చేయుట కంటె పూజనీయమైన బుద్ధి కలిగి ఉండుట మంచిది. మాటలు చెప్పుట కంటె నిశ్చలమైన మనస్సు కలిగి వుండుట మంచిది. కులము కంటె గుణము ముఖ్యమైనది.


**ఉత్తముని కడుపున నోగు జన్మించిన**
**వాఁడె చెఱచు వాని వంశమెల్లఁ**
**జెఱకు వెన్నుపుట్టి చెరపదా తీ పెల్లః**
**విశ్వదాభిరామ వినురవేమ!**

తాత్పర్యం : చెఱకు కర్రలో వెన్నుపుట్టి ఆ కర్రయందలి తీపినంతయు యెట్లు చెరుపుచున్నదో, అట్లే మంచివాని కడుపున చెడ్డవాడు పుట్టిన ఆ వంశమునకే అపకీర్తి తెచ్చును.



కథ

# బంగారు పంట



రామాపురం అనే గ్రామంలో ఇద్దరు పేద దంపతులు నివసించేవారు. వారి పేర్లు శివ, సరళ. వాళ్లకి ఇద్దరు పిల్లలు వారి పేర్లు రాజు, సురేష్. శివ తనకున్న పొలంలో దున్నుకొని వచ్చిన డబ్బుతో జీవనం సాగిస్తూ ఉండేవాడు. ఒక రోజు శివకు ఆరోగ్యం బాగోలేదు. అతనే వాళ్ల ఇంటికి ఆధారం. తన పిల్లలిద్దరు చాలా సోమరులు.

శివ అతని కొడుకులను చిన్నప్పటి నుంచి పని అంటే ఏంటో తెలియకుండా పెంచాడు. అందుకు అతని భార్య సరళ ఎప్పుడు అంటూనే ఉండేది వాళ్లకి ఇప్పుడు పనంటే ఏంటో తెలియకపోతే వారు మనం ముసలివాళ్లమైన తరువాత మనల్ని పోషించరు. ఇప్పుడు శివకు తన తప్పు తెలిసి బాధపడ్డాడు. అలా కొన్ని రోజులు గడిచాయి. కొన్ని రోజులకు శివ మిత్రుడైన రాము శివ ఇంటికి వచ్చాడు. అతను చాలా తెలివైనవాడు. శివ తనకు జరిగిన విషయం రాముతో చెప్పాడు. రాము శివ చెవిలో ఏదో ఆలోచన చెప్పాడు.

శివ, సరళలు కొడుకులకు పొలాలను, కూరగాయల తోటల్ని చూపించి, వారిలో ఒక ఆలోచన కల్గించారు. ఎన్నడూ పొలాల వైపు వెళ్లని వారికి కొత్తగా అనిపించింది.

అందుకే వారిచేత కూరగాయల సాగుకు ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు. కొడుకులను తమతో పాటు తీసుకెళ్తూ మంచి ప్రయోజకులను తయారు చేసారు.

– పి. కార్తీక్
9వ తరగతి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
దోసలుడికి, గుంతకల్లు, అనంతపురం, ఆంధ్రప్రదేశ్.
m : 63047 54254

ఆట

# స్పూనులో నిమ్మకాయ





**ఎంత మంది పాల్గొనవచ్చు –**
**ఐదుగురు ఆ పైన**

**ఎక్కడ ఆడవచ్చు –**
**ఆరు బయట**

**ఈ ఆటకు గల ఇతర పేర్లు –**
**లెమన్ అండ్ స్పూన్**

'లెమన్ అండ్ స్పూన్' ఆటలో పాల్గొనే పిల్లలందరినీ ఒకరి పక్కన ఒకరిని కొంచెం దూరం దూరంగా నిలబెట్టాలి. అందరికీ ఒక స్పూన్, ఒక నిమ్మకాయ ఇవ్వాలి. స్పూన్ నోట్లో పెట్టుకుని అందులో నిమ్మకాయను పెట్టాలి. స్టార్ట్ చెప్పగానే, అందరూ నడుచుకుంటూ ముందుగా మార్క్ చేసిన లైను వద్దకు నిమ్మకాయ కింద పడకుండా నడవాలి. ఎవరు ముందుగా గీత వద్దకు చేరుకుంటే వారు ఆటలో గెలిచినట్టు.

**ప్రయోజనం :**

- స్పూన్ వంచకూడదు, ఆకారంలో ఎలాంటి మార్పు చేయకూడదు.
- ఆట పూర్తి అయ్యేంతవరకూ స్పూన్ నోట్లో పెట్టుకుని ఉండాలి.
- ఎట్టి పరిస్థితుల్లో చేతులను ఉపయోగించకూడదు.
- ఆట మధ్యలో నిమ్మకాయ కింద పడిపోతే వారు ఆట నుంచి వైదొలగాలి. ఈ ఆట ఆడటం ద్వారా పిల్లల్లో ఏకాగ్రత పెరుగుతుంది. వేగము (speed) నియంత్రణ (control) ల మధ్య సమన్వయము పాటించాలన్న విషయము తెలుస్తుంది.

– 'చిన్ననాటి ఆటలు–జ్ఞాపకాల మూటలు' నుండి...

✧ సీరియల్-8

# బంగారు మర్రి

(బాలలకోసం
ఆధునిక సాహస నవల)




(గత సంచిక తరువాయి...)

ఫోరెన్సిక్ ల్యాబ్ నుంచి రిపోర్ట్స్ వచ్చాయి. రక్తం నమూనా, వెంట్రుకలు దంతాలు పరిశీలించాక అవి పులివి కాదని తేలింది. అవి జింకవని రిపోర్టు వచ్చింది. అంటే పులి ఇక్కడే తిరుగు తూంది. అడవిలో దొరికిన మద్యం సీసాల వేలిముద్రలు, రిసార్ట్స్‌లోని 306వ రూమ్‌లో దొరికిన మద్యం సీసాల మీది వేలిముద్రలు ఒకటి కావని రిపోర్ట్‌లో తేలింది. అంటే రాత్రి అడవిలోకి ప్రవేశించిన వేటగాళ్లు రిసార్ట్స్‌లో అనుమానితులు ఒకరు కాదు. పైగా ఆ గదిలో దొరికిన పులి గోరు పులిది కాదని తేలింది. అది దుప్పికొమ్ముతో తయారు చేసిన నకిలీ పులిగోరుగా గుర్తించారు. అంటే వాళ్ళు నకిలీ పులిగోర్ల వ్యాపారం చేసే వారై ఉండవచ్చు లేదా కొని ఉండవచ్చు. అంటే పులి బతికే ఉందని తెలిసి ఫారెస్ట్ అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

అడవి చుట్టుపక్కల పల్లెలో వేటగాళ్లు ప్రవేశించ కుండా మరింత నిఘా ఏర్పాటు చేయాలని నిర్ణయించు కున్నారు.

అడవి చుట్టు పక్క ఉన్న పల్లెలలో ఇన్‌ఫార్మర్ల సంఖ్య పెంచాలనుకున్నారు.

కాత్రాజు మధ్యాహ్నం భోజనానికి ఇంటికి బయలు దేరారు. పులులపెంట వైపుగా అతనికి పులిపాదాలు కనిపించాయి. అడుగులో అడుగేసుకుంటూ పులి అడుగులను అనుసరించాడు. దూరంగా ఎండిన పోయిన మొసల్ల మడుగు దగ్గర దాహం తీర్చుకోటానికి నీటిని వెతుక్కుంటూ నడుస్తున్న పులిని చూశాడు కాత్రాజు. తను ఉద్యోగంలో చేరిన రెండు సంవత్సరాల తర్వాత మొదటి సారిగా అడవిలో పులి కాత్రాజు కంటపడింది.

అంతవరకు అడవిలో పులులు తిరుగుతాయని వినటమే కానీ ప్రత్యక్షంగా చూసిందే లేదు. ఆ మాటకొస్తే చాలా కొద్ది మంది అటవీశాఖ ఉద్యోగులే పులిని ప్రత్యక్షంగా చూశారు. ఎర్రని నారింజ రంగు శరీరంపై తెల్లని మచ్చల పులి రాజసానికి ప్రతీకగా అనిపించింది. ఆకట్టుకునే రూపం. గజరాజునైనా మట్టికరిపించగల పంజా.

కండరాలతో కూడిన శరీరం, కుదించబడిన కాళ్ళు, విస్తృత ముందు పాదాలతో బలమైన ముందరి కాళ్లు, పెద్ద తల, పొడవైన తోక మిగిలిన శరీరంలోని సగం పొడవుతో ఉంది. చెవులు గుండ్రంగా ఉన్నాయి.

గుండ్రని చురుకైన అన్వేషించే నేత్రాలు, ముక్కు చిన్న నల్లని చుక్కలతో త్రిభుజాకార గులాబీ రంగులో


ఉంది. చూడగానే తెలీకుండానే రెండు చేతులు ఎత్తి పులికి దండం పెట్టాడు. పులి ఎవరికోగాని అలా కనిపించదు. చెంచులు పులిని దేవతలా కొలుస్తారు.

పులి కూడా కాట్రాజుని చూసింది. కాట్రాజు కదలకుండా పులి కండ్లలోకి చూశాడు. పులి పెద్దగా గాండ్రించింది. కాట్రాజు పక్కనే ఉన్న చింతచెట్టు ఎక్కాడు. కొద్దిసేపు ఎండిన మొసల్ల నాగులో నీటి కోసం తచ్చాడి పక్కనే ఉన్న రాళ్లను, ముళ్ల చెట్టును నాలుకతో నాకి అక్కడి నుండి ముందుకు కదిలింది.

పులులు రోజుకు 20 గ్యాలన్ల వరకు నీరు తాగుతాయి. పులులకు నీరంటే ప్రాణం. అవి చక్కగా నీటిలో ఈదుతాయి. ఆహారం కోసం వేటాడే జంతువును నీటిలో ముంచి చంపటమంటే మరీ ఇష్టం. గంటల తరబడి నీటిలో తేలుతూ సమయం గడుపుతుంది. అలాంటి పులికి తాగటానికి కూడా అడవిలో నీటి కొరత ఏర్పడింది. (సశేషం...)

– పైడిమర్రి రామకృష్ణ
m : 9247564699

# లాజికల్ రీజనింగ్ & ఆల్ఫాబెట్ టెస్ట్




**1998 జూన్ 17వ తేదీ వారంలో ఏ రోజు?**

(A) సోమవారం (B) మంగళవారం

(C) బుధవారం (D) గురువారం

**సమాధానం: ఎంపిక (జ)**

**వివరణ:**

17 జూన్, 1998 = (1997 సంవత్సరాలు + 1.1.1998 నుండి 17.6.1998 వరకు కాలం)

1600 సంవత్సరాలలో బేసి రోజులు = 0

300 సంవత్సరాలలో బేసి రోజులు = (5×3) = 1

97 సంవత్సరాలలో 24 లీపు సంవత్సరాలు ౦ 73 సాధారణ సంవత్సరాలు ఉంటాయి.

97 సంవత్సరాలలో బేసి రోజుల సంఖ్య ( 24 × 2 + 73) = 121 = 2 బేసి రోజులు.

జనవరి ఫిబ్రవరి మార్చి ఏప్రిల్ మే జూన్

(31 + 28 + 31 + 30 + 31 + 17)

.: 168 రోజులు = 24 వారాలు = 0 బేసి రోజు.

మొత్తం బేసి రోజుల సంఖ్య = (0 + 1 + 2 + 0) = 3

**ఇచ్చిన రోజు బుధవారం.**

**A, B, C, D మరియు E లు ఒక బెంచ్ మీద కూర్చున్నారు. A B పక్కన కూర్చున్నాడు, C D పక్కన కూర్చున్నాడు, D బెంచ్ యొక్క ఎడమ చివరన ఉన్న E తో కూర్చోలేదు. C కుడి నుండి రెండవ స్థానంలో ఉన్నాడు. A B కి కుడి వైపున ఉన్నాడు మరియు E. A మరియు C కలిసి కూర్చున్నారు. A ఏ స్థానంలో కూర్చున్నాడు?**

A B మరియు D మధ్య

B B మరియు C మధ్య

E మరియు D మధ్య

D C మరియు E మధ్య

**సమాధానం: ఎంపిక B**

**వివరణ:**

E B A C D

కాబట్టి, A, B మరియు C ల మధ్య కూర్చుని ఉన్నాడు.

కథ

# నత్త పిల్ల స్నేహితులు

"అమ్మా! నేను ఎందుకు ఇంత మెల్లగా నడుస్తాను?" అమాయకంగా అడిగిన కొడుకును చూసి జాలి పడింది నత్తపిల్ల తల్లి..

"ఎందుకు రా అలా అంటావు? మీ బడిలో పరుగు పందెం పెడితే నువ్వే గెలుస్తావు," నత్తపిల్లను ముద్దాడుతూ అంది తల్లి. "అబద్దం చెప్పవద్దమ్మా.. నేను అందరికంటే చివర్లో ఉంటాను." తనను సంతోషపెట్టడానికి తల్లి అలా అన్నదని అర్థం చేసుకున్నాడు నత్తపిల్ల.



"సరే, ఇప్పుడు నువ్వు మెల్లగా నడవడం వల్ల వచ్చిన ఇబ్బంది ఏమిటో చెప్పు" అడిగిందామె.

"కాదమ్మా, అందరూ పరుగు, పరుగున నడుస్తుంటే నేను ఎంత ప్రయత్నించినా పరుగున నడవలేక పోతున్నాను" కళ్ళలో నీళ్ళతో అన్నాడు నత్తపిల్ల. ఆ ప్రశ్నకు తల్లి జవాబు చెప్పక ఊరుకుంది.

కొంచెం సేపు అలానే దిగులుగా కూర్చొని "అమ్మా. నేను ఆడుకొని వస్తాను" అంటూ పాకుకుంటూ బయటకు వెళ్ళాడు నత్తపిల్ల. అలా వెళ్ళాడే కానీ, ఎంత ఆపుకుందామన్నా కన్నీళ్ళు ఆగడం లేదు వాడికి.

"ఏంటి నత్తపిల్ల, అలా ఏడుస్తున్నావు" అటుగా వెళుతున్న చీమపిల్ల అడిగింది.

"నేనా ఏడవడం లేదు," అన్నాడు నత్తపిల్ల.

"మరి నీ కళ్ళల్లో నుండి నీళ్ళు అలా కారుతున్నాయి ఏంటి?" అడిగింది చీమపిల్ల.

"నిజం చెప్పనా, నేను అందరికంటే మెల్లగా ఎందుకు పాకుతాను" దిగులుగా అన్నాడు. "నువ్వు చూడు ఇంత చిన్నగా ఉన్నావు, కానీ ఎంత స్పీడ్‌గా పరుగెత్తుతున్నావో కన్నీళ్లు తుడుచుకుంటూ అన్నాడు నత్తపిల్ల.

"ఓ అదా నీ దిగులు. నువ్వు నెమ్మదిగా పాకినా, నేను త్వరగా పరిగెత్తినా మనం అనుకున్న చోటుకే కదా చేరుతాము" తెలివిగా అంది చీమపిల్ల.

"మీరు ఐదు నిమిషాల్లో చేరితే, నాకు అరగుట పడుతుంది," పక్కనుండి గబగబా వెళుతున్న గొంగళి పురుగును చూసి ఆగిపోయాడు నత్తపిల్ల.

"అటు చూడు ఆ గొంగళి పురుగు ఎంత హుషారుగా వెళుతుందో" అన్నాడు మళ్ళీ దిగులుగా.

నత్తపిల్ల, చీమపిల్ల ఒక చెట్టు కింద చేరాయి. వాళ్ళ ముందు నుండి ఒక కప్పపిల్ల ఒక్క గంతులో ఇక్కడ నుండి అక్కడికి, అక్కడ నుండి మేరో గంతులో ఇంకా ముందుకు వెళ్ళడం కనబడింది. అలా వెళ్ళిన కప్పపిల్ల వెనక్కి తిరిగి చీమపిల్లను, నత్త పిల్లను చూసి వాళ్ళ దగ్గరకు వచ్చింది. చీమపిల్ల కప్పపిల్లకు నత్త పిల్ల బాధను వివరించింది. అలా అక్కడికి మరికొన్ని కీటకాలు, చిన్న, చిన్న జంతువులు చేరాయి.

అన్నీ నత్తపిల్ల సమస్య గురించి చర్చించుకున్నాయి.

"నత్త పిల్లకు చక్రాలు బండి తయారు చేసి ఇద్దాము" అంది చుక్కల పురుగు.

"దాన్ని ఎవరు నెడతారు" అనుమానంగా అడిగింది కప్పపిల్ల.

"హా.. నేను కొంచెం పెద్దగా ఉంటాను కదా, నా మీద ఎక్కించుకొని, గెంతుతూ తీసుకొని వెళతాను" అంది కప్పపిల్ల మళ్ళీ.

"అది ఎలా సాధ్యం. ప్రతిసారి నీకు వీలు పడదు కదా" అంది మట్టి పురుగు. నిజమే అనుకుంది కప్పపిల్ల.

"నత్తపిల్ల వీపుపై ఉన్న గూడుకు దారం కట్టి మనము లాగుతూ వెళదాం" అంది పేడ పురుగు.

"మనం లాగడం వల్ల పాపం దాని కాళ్ళకు రాళ్ళు గుచ్చు కుంటాయేమో" అంది చీమపిల్ల. అలా అందరూ వారి వారి అభిప్రాయాలను వినిపించి, చివరికి ఒక నిర్ణయానికి వచ్చాయి.

"మనందరం పరుగు పందెం పెట్టుకుందాం. నత్తపిల్లను ముందుగా పోనిచ్చి మనం చాలా నెమ్మదిగా నడిచి, నత్తపిల్లను గెలిపిద్దాం" అనుకున్నాయి. చీమపిల్ల దూరంగా కూర్చున్న నత్తపిల్లకు పరుగు పందెం గురించి చెప్పింది.


"నేనా? మీలోనా? పరుగు పందెమా? అది అసాధ్యం నన్ను ఎగతాళి చేయడానికి అంటున్నారు కదా" అడిగాడు నత్తపిల్ల.

"ఎందుకలా అంటావు. నువ్వే గెలుస్తావేమో, ఎవరికి తెలుసు? అసలు పరిగెత్తితే కదా తెలిసేది" అన్నాయి మిగిలిన కీటకాలు, జంతువులు. అందరూ వరుసలో నిలబడ్డారు. నత్తపిల్లకు తెలియకుండా ఒకరికొకరు సైగ చేసుకున్నాయి. నత్తపిల్ల తన శక్తినంతా కూడగట్టుకుని వేగంగా పాకుతూ వెళుతున్నాడు. మిగిలిన కీటకాలు వెనక పడ్డట్టు నడుస్తున్నాయి. అందరూ తనకంటే వెనకగా ఉండడం చూసి మరింత హుషారుగా పాక సాగాడు నత్తపిల్ల.

చివరకు నత్తపిల్లే గెలిచాడు. కీటకాలన్నీ చప్పట్లు కొట్టి నత్త పిల్లను అభినందించాయి. నత్త పిల్ల సంతోషానికి అవధులు లేవు. కాని తనని సంతోష పెట్టడానికి తన స్నేహితులు అలా చేశారని అర్థం చేసుకున్న నత్తపిల్ల స్నేహితులను చూసి ముసిముసిగా నవ్వి, అలాంటి స్నేహితులు దొరికినందుకు ఎంతో తృప్తి పడ్డాడు.

- ప్రణయజ
m : 9676708842









## తెలంగాణ చారిత్రక పర్యాటకం

# ధూళికట్ట


కోటలింగాలలో మొదలైన శాతవాహన ప్రస్థానం తెలంగాణలో గోదావరి నుండి క్రిష్ణానది వరకు విస్తరించింది. ఈ క్రమం పురావస్తుశాఖ తవ్వకాల్లో దొరికిన ఆధారాలు స్పష్టం చేస్తున్నాయి. వాటిలో ధూళికట్ట, పెద్దబంకూరు నాటి పట్టణాలు ఉమ్మడి కరీంనగర్ నేటి పెద్దపల్లి జిల్లాలో ఉన్నాయి. ధూళికట్ట నాడు ధూళికోటగా పిలవబడిన ఈ చారిత్రక గ్రామం పెద్దపల్లి జిల్లా కేంద్రం నుండి 16 కి.మీ. ఎలిగేడు మండల కేంద్రానికి 7 కి.మీ. దూరంలో ధూళికట్ట బౌద్ధ స్థూపం వడ్కాపూర్ రెవిన్యూ గ్రామ పరిధిలో ఉంది. సుల్తానాబాద్ సమీపంలో హుస్సేమియా వాగు ఒడ్డున ఉన్న ఈ ధూళికట్ట చారిత్రక ప్రదేశంలో ఎక్కడ తవ్వినా పాతకుండలు పెద్ద పెద్ద ఇటుకలు, కుండ పెంకులు, పూసలు, నాణాలు దొరుకుతున్నాయి. గతంలో ఎత్తైన మట్టి గోడ మధ్యలో పొలాలు కన్పించేవి. ఈ మట్టికోట రెండు వేల ఏళ్ళకు ముందు గ్రీకు చరిత్రకారుడు మెగస్తనీస్ ప్రస్థావించిన 30 శాతవాహన కోటల్లో ఒకటి. మట్టితో కట్టబడిన కోట ధూళికోట వాడుకలో నేడు ధూళికట్టగా పిలువబడుతుంది. ఇప్పుడు పూర్తిగా వ్యవసాయం విస్తరించిన దాదాపు 34 ఎకరాల భూమిలో శాతవాహన కాలం నాటి కోట క్రమంగా భూమి పొరల క్రిందకు వెళ్ళింది. హుస్సేమియా వాగుకు ఒకవైపు కోట ఉండగా కి.మీ. దూరంలో పెద్ద బౌద్ధ స్థూపం ఉంది. ఉత్తర తెలంగాణలో తొలినాటి బౌద్ధం అంటే థేరావద బౌద్ధాన్ని ప్రతిబింబించే ఈ స్థూపం ఒక ప్రత్యేకతను సంతరించుకుంది. 1974 నుండి 77 వరకు తిరిగి 1984 నుండి 85 వరకు ఇక్కడ పురావస్తు శాఖ జరిపిన త్రవ్వకాల్లో నాలుగు వైపులా కోటగోడలు 15.13×14.0 మీటర్ల కొలతలో మెట్లున్న రక్షక భటుల నివాసాలు, ఇటుకలతో నిర్మించిన ధాన్యాగారాలు, బావులు బయల్పడినవి. ఇంకా 55×22×77 సెం.మీ. కొలత గల ఇటుకలతో నిర్మించిన కట్టడాలు, పునాదులో కంకర ఇటుకలు పరచి కాంక్రీటు (సున్నంతో చేసిన), నీటి వాడకం, మురుగు కాల్వలు, నడకదారి క్రీ.పూ. 3వ శతాబ్దం నాటి టౌన్‌ప్లానింగ్ (పట్టణ ప్రణాళిక) వ్యవస్థను తెలియజేస్తున్నాము.

మట్టిదిబ్బ దగ్గర తవ్వకాల్లో వెలుగు చూసిన ఒక మహాస్థూపం, నాలుగు ఆయక వేదికలు కలిగి ఉంది. స్థూపం చుట్టూ అమర్చిన శిల్పఫలకాలు స్థూప, బుద్ధుపాద, బోధివృక్ష ఆరాధన ఫలకాలు, ధర్మచక్రం, బుద్ధుని ప్రతిమ ఆనవాళ్ళు లేకుండానే లభ్యం కావడం ఈ స్థూపం ఖచ్చితంగా తొలినాళ్ళ థేరవాద బౌద్ధానికి ఒక మంచి ఉదాహరణ. స్థూపానికి వాయువ్యంలో బౌద్ధ బిక్షువుల కోసం నిర్మించిన విహారాలు, శాతవాహన కాలపు నాణేలు, మట్టి పాత్రలు, పూసలు, బొమ్మలు టెర్రకోట అమ్మదేవత ప్రతిమ, ఇక్కడ ప్రత్యేకంగా హారతి (అమ్మదేవత) తల్లీబిడ్డల కంచు విగ్రహం లభించింది. ఇక్కడ దొరికన మరో అరుదైన ఐదు పండుగల నాగముచిలింద శిల్పం శాతవాహన కాలపు శిల్పాల్లోనే అద్భుతమైనది. దీనిపైన బ్రహ్మీలిపిలో "గుహపతినో పతలసమతుయ సమయదానం" అనే శాసనం ఉంది. ఈ శిల్పఫలకం బుద్ధుని సింహాసనం, పాదాలు దానికి పడగవలె నాగశిల్పం దాని వెనక బోధివృక్షం, చత్రం అత్యంత నైపుణ్యంతో చేసారు. కరీంనగర్ గాంధీ శత జయంతి పురావస్తు ప్రదర్శన శాలలో ధూళికట్టలో లభించిన పురావస్తులన్ని ప్రదర్శనకుంచారు. న్యూయార్క్ మెట్రోపాలిటన్ మ్యూజియం ఆఫ్ ఆర్ట్ (MEY) 2023లో జరిగిన ట్రీ అండ్ సర్పెంట్ (బోధివృక్షం, నాగశిల్పాలు) ప్రదర్శన క్రీ.పూ. 200 - క్రీ.శ. 400 మధ్య కాలంలోని దక్షిణ భారత బౌద్ధ కళా వైభవం ప్రపంచానికి చాటి చెప్పే అద్భుతమైన ప్రదర్శన జరిగింది. ముఖ్యంగా అరుదైన 125 పురాతన శిల్పాలను ప్రదర్శనకు ఎంపిక చేసారు. వీటిలో తెలంగాణలోని ధూళికట్ట నాగముచిలిందను ఎంపిక చేయడం ఆ శిల్పాన్ని తెలంగాణ చారిత్రక బౌద్ధ వారసత్వాన్ని ప్రపంచానికి పరిచయం చేసింది. ఈ ప్రదర్శన భారతదేశ బౌద్ధకళల చరిత్రలో ఒక సువర్ణ అధ్యాయంగా విమర్శకుల ప్రశంసలందుకోవడమే కాక ఒక చారిత్రక అన్వేషణగా ముఖ్యంగా రోమన్ సామ్రాజ్యంతో నాడు కొనసాగిన వ్యాపార సంబంధాలు తెలియజేస్తున్నాయని Front line magazine మరియు Tricycle Magazine పేర్కొన్నారు. ఇంత చారిత్రక నేపథ్యం ఉన్న ఈ స్థలాన్ని పూర్తి స్థాయి త్రవ్వకాలు చేసి సరైన పర్యాటక వసతులు కల్పిస్తే, రాబోయే కాలంలో ప్రపంచ పర్యాటకులు దృష్టిని ఆకర్షిస్తుందనడంలో అతిశయోక్తి లేదు.

– దేశరాజు శ్యాంసుందర్‌రావు – స్థపతి
m : 9010051177

సైన్సు

# ప్రదక్షిణాలు చేసే పాము




ఈ గారడీ చెయ్యడానికి కావలసిన వస్తువులు: దళసరి కాగితంలో నుంచి 6 అంగుళాల చదరపు ముక్క, చివర రబ్బరు ఉన్న పెనిసిలు, సూది, దారపు బండి, దర్జీలు ఉపయోగించే ధింబుల్, కొవ్వొత్తి.

దళసరి కాగితం మీద ఈ బొమ్మలో చూపించినట్లు "స్పైరల్" గీయాలి. చివర పాము తల కూడా గీయాలి. కత్తెరతో గీత వెంబడి కత్తిరించాలి.

దారపు బండి రంధ్రంలో చెక్కిన పెనిసిలు కొసను బిగువుగా దూర్చాలి. పెనిసిలు రెండవ కొసకి ఉన్న రబ్బరు ముక్కలో సూదిని నిట్టనిలువుగా గుచ్చాలి.

(సూది గుచ్చుకోకుండా) దర్జీలు వేలికి పెట్టుకునే "ధింబుల్"ను కాగితం మధ్యలో ఉన్న రంధ్రంలో దూర్చి, పెనిసిలు చివరి సూది మొన మీద పెట్టాలి. పెనిసిలు చుట్టూ కాగితం పాము కిందకి వేలాడుతుంది. దారపు బండిని బల్ల చివర నిలుచోబెట్టి, వెలిగించిన కొవ్వొత్తిని బొమ్మలో చూపినట్లు దారపు బండికి దగ్గరలో – కాగితపు పాము అంటుకోనంత దూరంలో – ఉంచాలి. పెనిసిలు చుట్టూ మెలికలు తిరుగుతుంది పాము. కొవ్వొత్తిని దూరంగా తీసుకుపోతే పాము ప్రదక్షిణాలు మానేస్తుంది! పాము ఇలా ప్రదక్షిణాలు ఎందుకు చేస్తుంది? అగ్నిదేవుడంటే భయం వల్లనా? కొవ్వొత్తి మండుతున్నపుడు కార్బన్‌డైఆక్సైడు వంటి వాయువులు కొన్ని బయటకి వస్తాయి. మంట వల్ల వేడెక్కిన గాలీ, ఈ వాయువులూ కలిసి, పైకి ప్రయాణం చేస్తాయి. (వేడి గాలి తేలిక కాబట్టి) వేడి గాలి పైకి వెడుతూ, దారిలో అడ్డుగా ఉన్న కాగితాన్ని తోస్తుంది. అది స్పైరల్ కావడంతో ఆ తోపుడికి పాము గిరగిరా తిరుగుతుంది.

– డాక్టర్ మహీధర నళినీ మోహన్

'ప్రతి ఇంటా ప్రయోగశాల' నుండి

## సామెతలు

- అంత్య నిష్ఠూరం కన్నా ఆది నిష్ఠురం మేలు
- ఆకలి ఎక్కువని రెండు చేతుల్తో తిన్నట్టు
- ఇల్లే తీర్థం, వాకిలే వారణాసి, కడుపే కైలాసం
- ఊళ్లేలని వారు రాజ్యమేలుతారా?
- ఎంత పండినా కూటికే, ఎంత వున్నా కాటికే
- ఏటి వంకలెవరు తీరుస్తారు?
- ఒకే జోడు అందరికీ సరిపోవునా?
- ఔను – కాదు అనే మాటలెంత చిన్నవో, వాటిని అనడం అంతకష్టం.

– బాలచెలిమి

లఘు నాటిక

# లైట్ తీసుకో...




**పాత్రలు: మధుకర్(తండ్రి), మాధవి (తల్లి)**
**పవిత్ర (కూతురు), పూజిత్ (కొడుకు)**

### దృశ్యం - 1

పూజిత్: లైట్ తీస్కో బాబు లైట్ తీస్కో.
లైట్ తీస్కో బాబు లైట్ తీస్కో..
(చదువుతున్న పవిత్ర చుట్టూ తిరుగుతూ డాన్స్ చేస్తుంటాడు)

పవిత్ర: నాన్న నాన్న ఇటు చూడండి ఒకసారి

మధుకర్: ఏంటమ్మా?

పవిత్ర: చూడండి నాన్నా... వీడు నన్ను చదువుకోనివ్వడం లేదు

మధుకర్: ఏరా ఏం చేస్తున్నావ్ నిజమేనా అక్కని చదువుకోనివ్వడం లేదా?

పూజిత్: నాన్న అదీ అదీ..

మధుకర్: ఏంటది నువ్వెలాగూ చదవవు చదువుకునే అక్కని కూడా చదువుకొనివ్వవా? అయినా నువ్వేంటి ఖాళీగా కూర్చున్నావు నీకు పరీక్షలు లేవా?

పూజిత్: ఆ ఉన్నాయి నాన్న అది కాసేపు ఆడుకున్నాక చదువుకుందామని (నసుగుతాడు)

మధుకర్: బుద్ధుందా నీకు అసలు ఓ పక్క పరీక్షలు అంటుంటే కాసేపు ఆడుకుంటానంటావు ఏంట్రా అసలే మార్కులు అంతంత మాత్రం...కష్టపడి చదవాలి కదా!

పవిత్ర: అది అలా అడగండి నాన్నా! వీడు అసలు ఏది సీరియస్ గా తీసుకోడు అసలు చదువు మీద ధ్యాసే లేదు అస్తమానం అన్నిటికి లైట్ తీస్కో లైట్ తీస్కో అంటాడు లేదా ఆటలాడుతానంటాడు.

మధుకర్: ఏరా అక్క చెబుతుంది నిజమేనా? నాకు సమాధానం కావాలి...

పూజిత్: అబ్బే ఏం లేదు నాన్నా నేను చదువుతాను (అంటూ బుద్ధిగా పుస్తకం బ్యాగు నుంచి పుస్తకాలు తీసుకొని తెరిచి రాసే ప్రయత్నం చేస్తాడు)

మధుకర్: చదవకుండా ఏదైనా తేడాగా ప్రవర్తించావనుకో ఏం చేస్తానో తెలుసుగా! (బెదిరించి వెళ్తాడు)

పూజిత్: (వాళ్ళ నాన్న అటు వెళ్ళగానే అక్క వైపు తిరిగి) అంతా నీవల్లే నా మీద చాడీలు చెప్తావేంటి చూడు నేను రాసుకుంటున్న (బ్యాగులో పుస్తకాలు తీసి ఒక బుక్కు తీసి ఇంకో బుక్కులో నుంచి చూసుకుంటూ పదేపదే అది రాస్తూ ఉంటాడు)

పవిత్ర: (మెల్లగా లేచి వచ్చి పూజిత పుస్తకాలు లాగి తీసుకొని చూస్తుంది) ఇది ఒకే ఈ పుస్తకంలో చూచిరాత నీది కాదే (ఈసారి అనుమానంగా అడుగుతుంది).

పూజిత్: అక్క చూడు నోట్స్ రాస్తున్న ఇది మా ఫ్రెండ్ పవన్‌ది చూసినావు కదా!

పవిత్ర: చూసా ఏంటి పవన్ నోట్స్ చూసి నువ్వు కాపీ చేస్తున్నావా నీ సొంతంగా రాయలేవా?

పూజిత్: అక్కోయి లైట్ తీస్కో! మా ఫ్రెండ్ విద్యాధర్ ఉన్నాడు కదా!

పవిత్ర: ఊ.. అయితే?

పూజిత్: నేనన్న నా ఫ్రెండ్ బుక్ చూసి రాస్తున్న. వాడైతేనా వాడు రాయకుండా కడుపునొప్పి కాలు నొప్పి అని నాటకాలు ఆడి వాళ్ళ అక్కతో పిన్నితో రాపిచ్చుకుంటాడు తెలుసా? నాకన్నా మస్తు లైట్

పవిత్ర: ఆహా అదేదో ఘనకార్యం లాగా చెప్తున్నావేంటిరా

పూజిత్: లేకుంటే... అక్కా నేను చెప్తున్నా విను నోట్స్ రాసినమా లేదా అది లెక్క. లైట్ తీస్కో! అయినా నీ లెక్క పుస్తకాల ముందు కూర్చొని చదివిందే చదివి రాసిందే రాసి నేను పడలేను మళ్ళీగీ ముచ్చట నాన్నకు చెప్పకు లైట్ తీస్కో సమజైందా?

పవిత్ర: నువ్వు అన్ని అలాగే లైట్ తీస్కో లైట్ తీస్కో అని ఈజీగా చేసేయాలని చూడకు రేపు అదే విషయాలు పరీక్షల్లో వస్తే ఎలా రాస్తావు? మనసు దాని మీద పెట్టి అర్థం చేసుకుంటూ రాయి సరేనా? (అని తన పుస్తకాలు తీసుకొని చదువుకుంటుంది)

మాధవి: పూజిత్.. పూజిత్.. ఏం చేస్తున్నావు?(లోపలి నుంచి వస్తుంది చేతులు తుడుచుకుంటూ)

పూజిత్: అమ్మా నోట్స్ రాసుకుంటున్న చూడు (అని చూపిస్తాడు)

పవిత్ర: (నీ గురించి చెప్పనా అని సైగచేస్తుంది)

పూజిత్: (అక్కకు వద్దు అని సైగ చేస్తాడు)

మాధవి: (మెటికలు విరిచి) మా నాయన ఎంత బాగా రాసుకుంటున్నావో... ఇదిగో స్వీట్ తిను (పక్కన డబ్బా నుంచి తీసి యిస్తుంది)

## దృశ్యం - 2

పవిత్ర: అమ్మా ఓసారిలా రా.. నాన్న మీరు కూడా

మాధవి: ఏంటి పవిత్ర?

మధుకర్: ఏంటమ్మా పవిత్ర?

పవిత్ర: మీతో ఓ విషయం మాట్లాడాలి

మధుకర్: దేని గురించి?

పవిత్ర: దేని గురించి కాదు తమ్ముడు గురించి

మాధవి: తమ్ముడా... ఏంటి ఏమైంది వాడికి? ఏం జరిగింది?

మధుకర్: తమ్ముడు గురించా ఏమైంది పవిత్ర?

పవిత్ర: అబ్బా అలా కంగారు పడకమ్మా... ఏమీ కాలేదు ఏమీ కాకూడదనే!

మధుకర్: అంటే...

పవిత్ర: అదే నాన్న ఈమధ్య మీరు గమనించారా పూజిత్ ఎలా ప్రవర్తిస్తున్నాడో?

మాధవి: ఏం చేశాడు?

పవిత్ర: ఏ పని స్వయంగా చేయడం లేదు. అన్నిటికి తేలికగా ఎలా చేయడమా అని చూస్తున్నాడు. నోట్స్ లు ఎవరివో కాపీ చేసి రాస్తున్నాడు. హోంవర్క్ చేయడం లేదు. పనిష్మెంట్ ఇస్తే ఏమాత్రం భయం లేకుండా లైట్ తీస్కో అంటాడు. ప్రతిదానికి ఈ లైట్ తీస్కో లైట్ తీస్కో ఏంటమ్మా అలా అయితే ఎలా?

మధుకర్: అవును పవిత్రా... చదువు మీద ధ్యాస లేదు ఆటలు తప్ప ప్రపంచం లేదు.

మాధవి: మరి నా దగ్గరేమో బుద్ధిగా ఉన్నట్టు నటిస్తున్నాడు పవిత్ర: మొన్న వాళ్ళ ఫ్రెండ్‌ని కొట్టాడట వాడు ఎందుకు కొట్టావని నిలదీస్తే ఏం కాదులే లైట్ తీస్కో అన్నాడట! నిన్న వాళ్ళ క్లాస్ టీచర్ చెప్పింది పరీక్షలో కాపీ కొడుతున్నాడని.. కాపీ కొడితే టీచర్ పట్టుకొని పనిష్మెంట్ ఇస్తుందని పక్కనున్న ఫ్రెండ్ ముందే చెప్పాడట! ఆ ఏం కాదు లైట్ తీస్కో అన్నాడట! నాకు పిలిచి టీచర్ చెబితే ఈ ఒక్కసారికి వదిలేయండి అని బతిమాలి వచ్చాను.

మధుకర్: రానీ వెధవని బెల్ట్ తీసుకొని నాలుగు ఉతికి పారేస్తా

మాధవి: అయ్యో ఏంటండీ ఏం చేయాలి అయినా మీరు కొడితే మారుతాడా?

పవిత్ర: ఏమాత్రం మారడు పైగా దాన్ని కూడా వాడు లైట్ తీస్కో అంటాడు లైట్ గానే తీసుకుంటాడు కూడా. కొట్టడం సమస్యకు పరిష్కారం కాదు. నా దగ్గర ఓ మార్గముంది.

మాధవి,

మధుకర్: ఏమిటది? (పవిత్ర వారి చెవిలో ఏదో చెబుతుంది... వారు తలలు ఊపుతారు)

### దృశ్యం - 3

మాధవి: పవిత్ర ఓసారిలా రా

పవిత్ర: ఏంటమ్మా మాధవి కొత్త సంవత్సరం వస్తుంది కదా నీకోసం ఓ డ్రస్ తెచ్చాను చూడు

పవిత్ర: అమ్మా చాలా బాగుంది (అటు ఇటు తిప్పి చూసుకుంటుంది. ఇంతలో పూజిత్ వస్తాడు)

పూజిత్: మరి నాకో!

మాధవి: ఇదిగో నీకు టీ షర్ట్

పూజిత్: అదేంటి టీ షర్టేనా? మరి ప్యాంటు?

మాధవి: (టీ షర్టు చూపిస్తూ) ఇదుందిగా ఇంక ప్యాంటెందుకు లైట్ తీస్కో (అని లోపలికి వెళుతుంది)

పవిత్ర: (టేబిల్ మీద డబ్బాలో స్వీట్ తీసుకుని తింటుంది)

పూజిత్: (తను కూడా వెళ్ళి చూసాడు డబ్బా ఖాళీ) మరి నాకో

పవిత్ర: నేను తినేసానుగా ఇంక నీ కెందుకు? లైట్ తీస్కో

మధుకర్: (ఫోన్ మాట్లాడుతూ అటు ఇటు తిరుగుతూ) హలో సుధాకర్ నేను బాగున్నాను రా నువ్వెలా ఉన్నావ్? ఆ బర్త్ డే పార్టీయా ఓ తప్పకుండా వస్తాం నేను మా ఆవిడ మాధవి, మా అమ్మాయి పవిత్ర కూడా వస్తుంది... అబ్బాయా అబ్బాయి పూజిత్ రాడులేండి... వాడు అన్ని లైట్ తీసుకుంటాడు. ఏదో ఆడుకుంటాడు. మేము వస్తాం తప్పకుండా(ఫోన్ పెట్టేస్తాడు)

పూజిత్: అదేంటి నాన్నా

మధుకర్: ఆ ఏం వస్తావులేరా లైట్ తీస్కో (పూజిత్ తల పట్టుకుంటాడు)

పవిత్ర: నాన్నా నా ప్రోగ్రెస్ కార్డ్ సంతకం చేయాలి.

మధుకర్: ఏదీ ఇలా ఇవ్వు (చూసి) వెరీ గుడ్ పవిత్రా ఇంకాస్త కష్టపడి చదవాలి సరేనా (సంతకం చేస్తాడు)

పూజిత్: (గబ గబా బ్యాగులోనుంచి ప్రోగ్రెస్ కార్డ్ తెస్తాడు) నాది కూడా

మధుకర్: ఏదీ చూపించు ఆహాహా ఎంత పొదుపుగా తెచ్చుకున్నావురా మార్కులు!

పవిత్ర: టీచర్లు కూడా మార్కులు వేయడం లైట్ తీస్కున్నారనుకుంటా నాన్నా (నవ్వుతుంది)

మాధవి: (పూజిత్ చెవి పట్టుకుని) ఏరా నాతో బుద్ధిగా ఉన్నట్లు నటించి నువు చేసే నిర్వాకం ఇదా!

పూజిత్: అబ్బా అమ్మా నొప్పి నొప్పి

మాధవి: ఏం కాదులేరా లైట్ తీస్కో

మధుకర్: నేను కూడా ఓ నిర్ణయానికి వచ్చాను

మాధవి: ఏంటండి అది?

మధుకర్: ఏం లేదు నేను సంతకం చేయకూడదు అనుకుంటున్నా. ఏరా పూజిత్ లైట్ తీస్కో సరేనా

పూజిత్: అయ్యో నాన్నా సారీ (తప్పయినట్లుగా దండం పెడతాడు.. ప్లీజ్ నాన్నా ప్లీజ్ ఇక పై అలా లైట్ తీస్కోను. ఏ విషయంలో అయినా.. నాకు అర్థమైంది నాన్నా..
(పవిత్ర మాధవి పూజిత్ నే చూస్తుంటారు... వాళ్ళని నాన్నకి చెప్పమని సైగ చేస్తాడు)
నాన్నా ఈ ఒక్క సారికి నా తప్పుని లైట్ తీస్కొని వదిలేయండి ప్లీజ్

మధుకర్, పవిత్ర, మాధవి: ఇంతకీ వీడిని మనం లైట్ తీస్కోవాలంటారా?

- డా. సమ్మెట విజయ
m: 99898 20215

# గురువును దిద్దిన శిష్యుడు

ఏదైతే స్తోత్ర గానం అవుతుందనుకుంటామో అదే చరమ గీతం కావడం ఎంత ఆశ్చర్యకరమో, ఆ పని సాక్షాత్తు శిష్యుడే చేయడం మరింత ఆసక్తికరం: అయితే, సత్య నిరూపణలో ఏదైనా వాస్తవానికి వల్లకి పట్టాల్సిందే! సైన్స్ దృక్పథానికి జేజేలు పలకాల్సిందే!!

'సూర్య కేంద్రక సిద్ధాంతం' (Heleo-centric theory) కాదంటూ 'భూ కేంద్రక సిద్ధాంతం' (Geo-centric theory) బలవరచాలని టైకోబ్రాహి (Tychobrahe) (క్రీ. శ. 1546-1601) ఇరవై సంవత్సరాలు శ్రమించి పరిశీలనలు క్రోడీకరిస్తేనే, అతని శిష్యుడు జొహెన్నెస్ కెప్లర్ (Johannes Kepler) [1571-1630] ఆ పరిశీలనలను విశ్లేషించి భూకేంద్రక సిద్ధాంతానికి చావుదెబ్బ కొట్టి, సూర్యకేంద్రక సిద్ధాంతానికి నీరాజనం పట్టడం విజ్ఞాన చరిత్రలో గమనార్హమైన సందర్భం!



భూగతిని, సూర్యుడి గమనాన్ని అర్థం చేసుకోడానికి మొదట ప్రయత్నించివారు గ్రీకులు, వాటి గమనాలకు తొలుత ఒక రకమైన వివరణ ఇచ్చినవాడు రెండవ శతాబ్దానికి చెందిన టాలెమి (Ptolemy) (క్రీ.శ. 70-147). ఇతని వాదన ప్రకారం సూర్యుడు, చంద్రుడు మొదలైనవి భూమి కేంద్రంగా చేసికొని తిరుగుతున్నాయని, అందువల్ల ఆ సిద్ధాంతాన్ని 'భూకేంద్రక సిద్ధాంతం' అని పిలవడం జరిగింది. ఈ సిద్ధాంతం ఆ కాలపు తత్త్వశాస్త్రం లోనూ, సాహిత్యంలోనూ బాగా పాతుకుపోయింది. ఈ సిద్ధాంతం మూలచట్రంగా ఎన్నో 'పురాణ కథలు' వంటివి బాగా ప్రచారంలోకి వచ్చాయి. ఈ రకంగా ఈ సిద్ధాంతం మతంలోకి బాగా అల్లుకుపోయింది.

సాంస్కృతిక పునరుజ్జీవనం వల్ల నిదురలేచిన జిజ్ఞాస ఎన్నో పరిశీలనలతో, ప్రశ్నలతో పరిశోధనకు దారితీసింది. సూర్యోదయం, అస్తమయం, ఋతువుల మార్పిడి, ఋతువవనాల దిశ, చంద్ర కళలు వంటి ఎన్నో ప్రశ్నలకు టాలమి ప్రతిపాదించిన భూకేంద్రక సిద్ధాంతం వివరణ ఇవ్వలేకపోయింది. పరిశీలనలకు వివరణ ఇవ్వటానికి ప్రయత్నాలు ముమ్మరంగా సాగాయి. ఆ సందర్భంలో కోపర్నికస్ (Copernicus) (1473-1543) మరో సిద్ధాంతాన్ని ప్రవేశపెట్టాడు. ఈ సిద్ధాంతం ప్రకారం సూర్యుడి చుట్టు భూమి మొదలైన గ్రహాలు పరిభ్రమిస్తున్నాయి. అదే సూర్యకేంద్రక సిద్ధాంతం. ఈ సిద్ధాంతం నక్షత్రాల కదలికలను, ఋతువవనాల దిశను, ధృవాల వద్ద భూమి చదునుగా ఉండటాన్ని చక్కగా వివరించగలిగింది.

అయితే, భూకేంద్రక సిద్ధాంతం మతంలోనూ, మత ప్రచారంలోనూ ముఖ్యంగా సగటు మానవుడి మెదడులోనూ బలంగా నిలిచివుంది. ఇటువంటి సమయంలో భూకేంద్రక సిద్ధాంతాన్ని కాదని సూర్యకేంద్రక సిద్ధాంతాన్ని ఆమోదిస్తే వారి మత గ్రంథాలను మార్చాలి. జనుల నమ్మకాల్ని సవరించాలి. ఇవి అంత సులువుగా జరిగే పనులు గాదు. పైపెచ్చు తమ మతం ఉనికికే భంగం రావచ్చు. అందుకే మతవాదులు ఆలోచించే మేధావులను కాదని, సూర్యకేంద్రక సిద్ధాంతాన్ని ఎదుర్కొన్నారు. దాన్ని వాదించే వారిని నొక్కేయాలని నడుం కట్టారు. సూర్యకేంద్రక సిద్ధాంతాన్ని ప్రవేశ పెట్టిన సంవత్సరం లోనే కోపర్నికస్ జీవితం ముగిసిందంటే అదెంత వేఘవంతంగా పని చేసిందో ఊహించుకోవచ్చు. తర్వాత గెలీలియో (Galileo) [1564 - 1642] టెలిస్కోపును తయారు చేసి సూర్యకేంద్రక సిద్ధాంతానికి ఋజువు చూపితే అతణ్ణి జీవిత గృహ ఖైదు చేసి చంపారు.

మత ప్రచారకులు ఈ విధంగా సూర్యకేంద్రక సిద్ధాంతాన్ని నిరోధించాలను కుంటేటీ మరో వర్గపు మేధావులు ఇంకో విధంగా ఎదుర్కోవాలని భావించారు. అందులో ముఖ్యుడు టైకోబ్రాహి, డెన్మార్కు రాజు రెండవ ఫ్రెడ్రిక్ ఆధ్వర్యంలో యురానిబోర్గ్ పరిశీలనాశాలలో నిర్వాహకుడిగా చేరాడు. ఆయన ఆలోచన ఇలా ఉండేది. ప్రాయోగిక పరిశీలనలను క్రోడీకరించి, విశ్లేషించి తద్వారా భూకేంద్రక సిద్ధాంతాన్ని ఋజువు చేయాలని! దూరదర్శిని లేకుండా పరిశోధనలు చేసిన ఏకైక శాస్త్రవేత్త కూడా టైకోబ్రాహి. అతను ఇరవై సంవత్సరాల పాటు శ్రమించి ఎన్నో విలువైన పరిశీలనలు క్రోడీకరించాడు. ఈ మహత్తర కార్యంలో తన శిష్యుడు కెప్లర్ ఎంతగానో సాయపడ్డాడు. అయితే దురదృష్టవశాత్తు వాటిని విశ్లేషించకుండానే టైకోబ్రాహి మరణించాడు.

టైకోబ్రాహి శిష్యుడైన కెప్లర్ ఆ పనిలో దిగాడు. దేన్నైతే గురువు ఆశించి, ఏ సిద్ధాంతానికైతే ఋజువుతో బురుజు కట్టాలనుకున్నాడో శిష్యుడు కెప్లర్ దానికే గండి పెట్టి, శాస్త్రీయ పంథాలో గణితాత్మకంగా దాని పునాది కదిలించేశాడు. తొలుత తన గురువుతో కలిసి సేకరించిన సమాచారాన్ని అధ్యయనం చేయాలని భావించినప్పుడు దానికి సహకరించడానికి టైకోబ్రాహీ భార్య మొదట అంగీకరించలేదు. తర్వాత ఆమెకు ఎంతో నచ్చ చెప్పిన తర్వాత ఆ పరిశీలనలను తీసుకొని అధ్యనం చేశారు.

పైపెచ్చు గురువు దేన్నైతే వ్యతిరేకించాడో ఆ గురువు పరిశీలనల నాధారంగానే ఋజువుచేసి, దానికి పునాదులు వేశాడు.

- డా. నాగసూరి వేణుగోపాల్
ఆకాశవాణి విశ్రాంత సంచాలకులు, ప్రముఖ సైన్స్ రచయిత,
m : 9440732 392



# బత్తాయి చెట్టు


హాయ్ బాలలు బాగున్నారా! క్రిస్మస్ పండుగ బాగా ఎంజాయ్ చేశారు కదా! ఇక కొత్త సంవత్సరంలో సంక్రాంతి పండుగ కూడా బాగా జరుపుకుందాం. ఈ జనవరి నెల బాలచెలిమి సంచికలో మనం బత్తాయి చెట్టు గురించి తెలుసుకుందాం.


బత్తాయి చెట్టు అనేది నిమ్మ జాతికి చెందిన ఒక రకమైన పండ్ల చెట్టు. ఈ చెట్ల నుండి లభించే బత్తాయి పండ్లను ఆరంజ్ ఫ్రూట్స్ అని అంటారు. బత్తాయి తీయని 'రూటేసి' కుటుంబానికి సంబంధించిన చెట్టు. బత్తాయి పండ్లు నిమ్మ పండ్ల కంటే సైజులో బాల్ అంతటి పెద్దగా ఉంటాయి. ఇది తీయని పండ్లను ఇస్తుంది. వీటిని "స్వీట్ లైమ్" అని కూడా అని పిలుస్తారు. సహజంగా పై చర్మం పొట్టు వలచుకొని తినవచ్చు. ప్రస్తుతం మన రాష్ట్రంలో బత్తాయి సాగు వేల హెక్టార్ల భూములలో సాగు చేయబడుతుంది. మన తెలంగాణ రాష్ట్రం బత్తాయి సాగులో దేశంలోనే మొదటి స్థానాన్ని ఆక్రమించింది. నల్లగొండ జిల్లాలో బత్తాయి పంటల సాగు ఎక్కువగా కనబడుతుంది. ఎకరానికి బత్తాయి 12 మెట్రిక్ టన్నులు దిగుబడి వస్తాయి. నాటిన మూడు సంవత్సరాల నుండి 40 సంవత్సరాల వరకు పంట దిగుమతి వస్తుంది. బత్తాయిలో చీని, రంగాపూర్ వంటి అనేక రకాల మొక్కలు మార్కెట్లో లభిస్తాయి. బత్తాయి తోటల సాగు వల్ల వేలాది మంది రైతులు ఎక్కువ ఆదాయము పొందుతున్నారు. ఎర్రటి నేలల్లో బత్తాయి చెట్లు ఏపుగా పెరుగుతాయి. ఎకరానికి 80 నుండి 100 చెట్ల వరకు నాటవచ్చు. 30 ఫీట్ల ఎంతవరకు బత్తాయి చెట్టు పెరుగుతాయి. ఒక్కొక్క చెట్టు సైజును బట్టి వంద నుండి నాలుగొందల కాయలు వరకు కాస్తుంది.

బత్తాయి చెట్ల వల్ల ఎన్నో ఉపయోగాలున్నాయి. బత్తాయి పండ్లలో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. ఇది రోగ నిరోధక శక్తి కలిగి ఉంటుంది. ఇది ఒక ఆపిల్ పండుతో సమానం అంటారు. బత్తాయి పండ్లను పేదవాడి ఆపిల్‌గా పేర్కొంటారు. బత్తాయి పండ్లతో రసం పిండి జ్యూస్‌గా తాగవచ్చు. బత్తాయి పండు తింటే మనిషి ఆరోగ్యానికి ఎంతో ఉపయోగకరం. రోజు ఒక గ్లాసు బత్తాయి జ్యూస్ తాగితే జీర్ణ శక్తి మెరుగుపడుతుంది. చర్మం నాజూకుగా, అందంగా కనిపిస్తుంది. బత్తాయి ఆరోగ్యానికి అనేక విధాలుగా మేలు చేస్తుంది పోషక పదార్థాలు బాగా ఉండే బత్తాయిలో విటమిన్ 'సి' తో పాటు ఫాస్పరస్, పొటాషియం, కార్బోహైడ్రేటు, పోలెట్ వంటి విటమిన్లు, ఖనిజాలు సమృద్ధిగా ఉండే పండ్లు. బత్తాయి పండ్లు తినడం వల్ల గుండె పనితీరు మెరుగు పడుతుంది. రక్తప్రసరణ ప్రక్రియ సాఫీగా సాగుతుంది. బత్తాయి పండ్లు తినడం బరువు తగ్గడమే కాకుండా వల్ల ఒత్తిడి కూడా తగ్గుతుంది. జ్వరం వచ్చినప్పుడు బత్తాయి పండ్ల జ్యూస్ తాగితే మంచిది. ఈ జ్యూస్ తాగడం వల్ల చిగుళ్ళు నొప్పులు గొంతు సంబంధ వ్యాధులు తగ్గుతాయి. బత్తాయి పండ్లను నిలువ చేసి వైన్ వంటి మత్తు పదార్థాలు కూడా తయారు చేస్తారు. బత్తాయి పండ్లను మోసంబి అని కూడా పిలుస్తారు.

ఇట్లా ఎన్నో ఉపయోగాలు కలిగిస్తున్న బత్తాయి చెట్లను మనం కూడా పాఠశాల ఆవరణలో, ఇంటి పరిసరాలలో కూడా పెంచుకుందాం. బత్తాయి పండ్లను మనం కూడా తిందాం. ఆరోగ్యంగా ఉందాం. వచ్చే నెలలో మరో చెట్టు గురించి తెలుసుకుందాం.

– కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి
m : 9441561655


మన రాజ్యాంగం
THE CONSTITUTION OF
INDIA
బొమ్మలు:
రచన:
జుగాష్విలి
గోపి: తాతయ్యా! జనవరి 26 రాజ్యాంగం అమలులోకి వచ్చిన రోజు కదా! రాజ్యాంగం అంటే ఏమిటి?
తాతయ్య: దేశ ప్రభుత్వ నిర్మాణాన్ని, అధికారాలను, బాధ్యతలను, పౌరుల హక్కులనూ, బాధ్యతలనూ నిర్దేశించేది రాజ్యాంగం.
గోపి: అన్ని దేశాలకూ రాజ్యాంగాలున్నాయా? అన్ని రాజ్యాంగాలూ ఒక్కటేనా?
తాతయ్య: ప్రతి దేశానికీ తనదంటూ ఒక లిఖిత రాజ్యాంగం వుంటుంది. బ్రిటిష్‌కి మాత్రం లిఖిత రాజ్యాంగం లేదు. మాగ్నా కార్టా ప్రతిపాదించిన విలువలు, సంప్రదాయాలు, పాలనా విధానాలే దాని మౌఖిక రాజ్యాంగం.
గోపి: రాజ్యాంగాలు ఎప్పుడు, ఎందుకు మొదలయ్యాయి తాతయ్యా?
తాతయ్య: పూర్వం రాజుల ఇష్టప్రకారం పాలన వుండేది. కొందరు ప్రజలకు అనుకూలంగా వుంటే మరికొందరు నిరంకుశ పాలన సాగించేవారు. ప్రజలు దీనిని వ్యతిరేకించారు. పాలన ప్రజల సమ్మతి ప్రకారం వుండాలని రూసోవంటి మేధావులు సామాజిక ఒప్పందాన్ని ప్రచారం చేసారు. అదే ఆధునిక రాజ్యాంగాలకు ప్రేరణ.
గోపి: మన రాజ్యాంగం గురించి చెప్పు తాతయ్య
తాతయ్య: ప్రపంచంలోనే అతి పెద్ద లిఖిత రాజ్యాంగం మనది. అంబేద్కర్ అధ్యక్షతన ఏర్పడిన కమిటి ప్రపంచ దేశాల రాజ్యాంగాలను అధ్యయనం చేసి అనేక చర్చల అనంతరం ప్రజాస్వామిక పాలనకు దిక్సూచిలా మన రాజ్యాంగ రచన చేసింది.
గోపి: మన రాజ్యాంగంలో ఏముంది తాతయ్య?
తాతయ్య: ప్రవేశిక, ఆదేశ సూత్రాలు మన రాజ్యాంగంలో ప్రధాన అంశాలు.


గోపి: ప్రవేశిక అంటే ఏమిటి తాతయ్య?
తాతయ్య: మన రాజ్యాంగానికి ప్రవేశిక ఆత్మ వంటిది. మన రాజ్యాంగ మౌలిక స్వరూప స్వభావాలను వివరిస్తుంది. సాంఘిక రాజకీయ, ఆర్థిక అసమానతలు లేని సమాజం దీని లక్ష్యం. ఫెడరల్ వ్యవస్థ, కేంద్ర, రాష్ట్ర సంబంధాలు, సమానత్వపు హక్కు, ప్రాథమిక హక్కులు, అధికార వికేంద్రీకరణ, విద్యా హక్కు యిందులో ముఖ్యమైనవి.
గోపి: ఆదేశిక సూత్రాలు అంటే ఏమిటి తాతయ్య?
తాతయ్య: ప్రజల కోసం రాజ్యం ఏమేమి చేయాలో నిర్దేశిస్తూ రాజ్యాంగంలో పొందుపరిచిన అంశాలే ఆదేశిక సూత్రాలు. ప్రజల సంక్షేమాన్ని, ప్రజల హక్కులను, కాపాడవలసిన పాలనా వ్యవస్థల, వివిధ స్వతంత్ర వ్యవస్థల పనివిధానాలను సూచిస్తాయి.
గోపి: పౌరులుగా మనం ఏం చేయాలి తాతయ్యా?
తాతయ్య: మన దేశ సార్వభౌమత్వం, సమగ్రత, ఐక్యతలను బహుళ సంస్కృతిని కాపాడటం, దేశ రక్షణ మన విధి.
తాతయ్య: గోపీ మనం టూకీగా చెప్పుకున్నాం. రాజ్యాంగం చదవాలి. రాజ్యాంగంపై జరుగుతున్న చర్చలను అధ్యయనం చేయాలి. రాజ్యాంగ పరిరక్షణ మన కర్తవ్యం.
గోపి: అలాగే తాతయ్య.




## టీ 20ల్లో నెంబర్ వన్ బౌలర్‌గా చరిత్ర సృష్టించిన భారత మహిళా ఆల్ రౌండర్

# దీప్తి శర్మ

భారత మహిళా క్రికెటర్ దీప్తి శర్మ (Deepti Sharma) మరో అరుదైన ఘనతను తన ఖాతాలో వేసుకుంది. ఐసీసీ తాజా ర్యాంకింగ్స్‌లో టీ20 ఫార్మాట్‌లో ప్రపంచ నెంబర్ వన్ బౌలర్‌గా నిలిచి, తన కెరీర్‌లో తొలిసారిగా అగ్రస్థానాన్ని అందుకుంది. శ్రీలంకతో జరిగిన తొలి టీ20 మ్యాచ్‌లో ఆమె చూపిన అద్భుత ప్రదర్శన ఈ ఘనతకు బాటలు వేసింది.

ఆల్‌రౌండర్‌గా నిరంతరంగా రాణిస్తున్న దీప్తి శర్మ, కీలక వికెట్లతో జట్టుకు విజయాన్ని అందించడంలో కీలక పాత్ర పోషించింది. ఈ మ్యాచ్‌లో భారత్ 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించగా, దీప్తికి ఐదు కీలక ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. ఫలితంగా, ఆస్ట్రేలియా బౌలర్ అన్నాబెల్ సదర్లాండ్‌ను కేవలం ఒక పాయింట్ తేడాతో వెనక్కి నెట్టి అగ్రస్థానాన్ని కైవసం చేసుకుంది. అన్నాబెల్ ఆగస్టు నుంచి నెంబర్ వన్ స్థానంలో కొనసాగుతున్న విషయం తెలిసిందే.

ఇదే సమయంలో వన్డే బ్యాటర్ల ర్యాంకింగ్స్‌లో భారత స్టార్ బ్యాటర్ స్మృతి మంధానా తన నెంబర్ వన్ స్థానాన్ని కోల్పోయింది. దక్షిణాఫ్రికా కెప్టెన్ లౌరా వోల్వార్డ్ అద్భుత ప్రదర్శనతో అగ్రస్థానానికి చేరుకుంది. ఐర్లాండ్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో ఆమె చూపిన నిలకడైన ఆట ఈ విజయానికి కారణమైంది. ప్రస్తుతం మంధానా రెండో స్థానంలో కొనసాగుతోంది. మరోవైపు, టీ20 బ్యాటర్ల జాబితాలో జెమీమా రోడ్రిగ్స్ టాప్ టెన్‌లోకి అడుగుపెట్టింది. శ్రీలంకతో జరిగిన మ్యాచ్‌లో అర్ధసెంచరీ సాధించి 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు గెలుచుకున్న జెమీమా ప్రస్తుతం 9వ స్థానంలో నిలిచింది. టాప్ టెన్‌లో స్మృతి మంధానా, షఫాలీ శర్మ కూడా చోటు దక్కించుకోవడం విశేషం.

భారత మహిళా క్రికెట్‌కు దీప్తి శర్మ సాధించిన ఈ ఘనత మరో మైలురాయిగా నిలవనుంది. ప్రపంచ వేదికపై భారత ఆటగాళ్ల ప్రతిభకు ఇది మరో నిదర్శనం.

– బాలచెలిమి డెస్క్

కథ

# పర్యావరణాన్ని కాపాడుదాం



నెల్లుట్ల అనే గ్రామంలో భరత్ అనే పిల్లవాడు ఉన్నాడు. అతడు చాలా ఆకతాయి. కానీ చాలా తెలివైన వాడు కూడా. అతడు పక్క గ్రామంలో ఉన్న తెలంగాణ ఆదర్శ పాఠశాలలో చదువుతున్నాడు. అతని గ్రామంలో ఒక సమస్య ఉండేది.

ఊరు చివరనున్న ఒక పాడుబడ్డ బంగ్లాలో దెయ్యం ఉండేదని నమ్ముతారు. ఆ నల్లటి అవతారం అర్ధరాతి పాత బంగ్లా మొత్తం తిరుగుతుందని పెద్దపెద్ద అరుపులతో శబ్దాలు చేస్తుందని భయపడతారు.

ఈ విషయమంతా భరత్ పాఠశాలలో వాళ్ళ గురువుగారికి తెలియజేస్తాడు. గురువుగారు "ఆ గ్రామ ప్రజలంతా చాలా మంచివారు. అలాంటి వారు అనవసరంగా భయపడుతున్నారు" అని అనుకున్నాడు. ప్రజల దగ్గరికి వెళ్ళి వాళ్ళతో "నేను ఈ రాత్రి మొత్తం పాడు బడ్డ బంగ్లా ప్రక్కన ఉన్న ఇంట్లో ఉంటాను" అని అన్నాడు. గ్రామప్రజలు వద్దన్నా వినకుండా వెళ్ళాడు.

రాత్రి గడిచింది తెల్లవారు అయ్యింది. గురువుగారు గ్రామ ప్రజల దగ్గరికి వచ్చి అక్కడ ఎలాంటి దెయ్యం. భూతం లేదు. అక్కడ ఒక పెద్ద ఎలుగుబంటి ఉన్నది. అదే రాత్రి సమయంలో దానికి ఆకలివేసినప్పుడు బిగ్గరగా పెద్ద పెద్ద శబ్దాలతో భయంకరంగా అరుస్తుంది.

ఇదంతా తెలియక మీరు అక్కడ దెయ్యం, భూతం ఉందని నమ్మి అనవసరంగా భయపడ్డారు. దెయ్యం, భూతాలనేవి కల్పితాలు మాత్రమే. నిజజీవితంలో అస్సలు లేవు. గురువుగారు చెప్పిన మాటలన్ని విని గ్రామ ప్రజలంతా కొంత కుదటపడ్డారు.

కానీ అప్పుడే గ్రామ సర్పంచ్ 'మరి ఎలుగుబంటిని అడవిలోకి ఎలా పంపేది గురువుగారు?" అని అడిగాడు.

"ఎలుగుబంటిని సురక్షితంగా తీసుకెళ్ళడానికి మూగ జీవ రక్షకులు ఉంటారు. వారిని పిలిస్తే వారే ఎలుగుబంటిని అడివిలోకి తీసుకెళ్తారు. అస్సలు ఎలుగుబంటి గ్రామంలోకి రావడానికి కారణం గ్రామం చుట్టూ చెట్లను నరకడం, పర్యావరణాన్ని నాశనం చేయడం వలన. అడవులు పల్చగా కావడం మూగ జీవాలకు తిండి దొరకక ఊర్లల్లో పడి ఇబ్బంది చేస్తున్నాయి. ఇప్పటి నుంచైనా పర్యావరణాన్ని రక్షిద్దాం, చెట్లను నాటుదాం కాలుష్యాన్ని నిర్మూలిద్దాం!" అన్నారు గురువుగారు. ప్రజలంతా "అలాగే గురువు గారూ" అన్నారు.

-యస్. మధు కిరణ్
టి.జి.యమ్.యస్., లింగాల ఘనపురం, జనగాం
m : 9908628430

# నక్క – యుద్ధభేరి కథ



ఒక అడవిలో ఒక నక్క ఉండేది. దానికి చాలా రోజులు ఆహారం దొరకలేదు. అది ఆకలితో అల్లాడుతూ తిండి కోసం అక్కడా ఇక్కడా తిరిగింది. తిరిగి తిరిగి ఒక యుద్ధభూమిని చూసింది. అక్కడ దానికి చాలా శవాలు కనిపించాయి. ఆ యుద్ధభూమికి ఒక మూల ఒక చెట్టు క్రింద ఒక యుద్ధభేరి పడి వుంది. చెట్టుకొమ్మలు గాలికి ఊగి, ఆ భేరీకి తగిలినప్పుడుల్లా అది గట్టిగా శబ్దం చేస్తోంది. ఆ ధ్వనికి నక్క బెదిరిపోయి, ఏమీ తినకుండా చాలా సేపు ఒక ప్రక్క నక్కి కూర్చున్నది. అంతలో దానికి ఒక ఆలోచన కలిగింది. "నేను శబ్దానికే ఎందుకు భయపడాలి? సుఖదుఃఖాలలో కాస్త ఆలోచించి, తెలివితో మెలిగినప్పుడే మనం సుఖపడగలం. అటువంటి వాడే బుద్ధిమంతుడు" అనుకుని నక్క ధైర్యంగా వెళ్ళి ఆ భేరీని చూసింది. ఆ శబ్దాల వెనుకనున్న రహస్యం దానికి తెలిసిపోయింది. ఆ భేరీ నిండా కొవ్వు కూరి పెట్టారనుకుని ఆశతో దాన్ని కొరికి చూసింది. దానిలో ఏమీ లేదని, ఉన్నవి చర్మం, చెక్క మాత్రమేనని గ్రహించి ఆశ్చర్యపోయింది. యుద్ధ భూమిలో పడి ఉన్న ఆహారాన్ని చాలా రోజుల పాటు ఆనందంగా తింది.

**నీతి : దేని గురించైనా విన్నంత మాత్రంతోనే బెదిరిపోకూడదు. పరిస్థితిని పరిశీలించకుండా ముందుగానే ఏదేదో ఊహించుకుని, భయపడటం తప్పు.**

సేకరణ : అమరావతి





# నీలం రాయి

## అర్కాది గైదార్

అనగనగా ఒక ఊరిలో ఒక ముసలాయన ఉండేవాడు. అతను ఆపిల్ పండ్లతోటకు కాపలాగా ఉండేవాడు. ముఖంపై గాటుతో, చూడడానికి ఎప్పుడూ దిగులుగా కనిపించేవాడు.

అదే ఊరిలో ఇవాస్కా అనే తొమ్మిదేళ్ళ పిల్లవాడు ఉండేవాడు. ఒక రోజు ఇవాస్కా ఆపిల్ తోటలో దూరి, కొన్ని ఆపిల్ పండ్లు దొంగిలించి పారిపోతుంటే, అతని చొక్కా ముళ్ళ కంచెకు చిక్కుకుంది. పరిగెత్తలేక ముసలి కాపలాదారుడికి దొరికిపోయాడు.

ముసలాయన తనని తిడతాడు, కొడతాడు అనుకున్నాడు. కానీ ముసలాయన పల్లెత్తు మాట కూడా అనకుండా, ఇవాస్కాని వదిలేశాడు.

పిల్లవాడు ఆశ్చర్యపోయాడు, తను చేసిన తప్పుకు సిగ్గుపడ్డాడు.

పిల్లవాడు ఇంటికి వెళ్లేదారిలో ఉన్న అడవిలో నడుస్తున్నాడు. నడిచి నడిచి అలసిపోయి ఒక బండపై కూర్చున్నాడు.

అది చాలా వేడిగా ఉంది.

తీరా చూస్తే అది నీలం రంగులో ఉంది.

దానిపై ఏవో అక్షరాలు చెక్కివున్నాయి. నీలం రాయిపై ఉన్న మట్టిని జాగ్రత్తగా తొలగించి, ఆ అక్షరాల్ని చదివాడు.

నీలంరాయిపై ఇలా రాసి ఉంది. "ఎవరైతే ఈ రాయిని కొండపైకి మోసుకెళ్లి, పగలకొడతారో వారికి తమ యవ్వనం లభిస్తుంది మరియు కొత్త జీవితం మొదలవుతుంది."

కనుక పిల్లవాడికి ఈ రాయి వల్ల సొంత ఉపయోగం

కనిపించలేదు.

కానీ ఇవాస్కా మంచి పిల్లవాడు. దయగల హృదయం కలవాడు. కనుక ఈ నీలం రాయి విషయాన్ని ముసలాయనకు చెప్పాడు. నీలం రాయిని కొండపైకి మోసుకు వెళ్ళడానికి ముసలాయన తిరస్కరించాడు.

కానీ ఇవాస్కా బతిమిలాడాడు. రేపు సాయంత్రం కొండపైకి రాయిని తీసుకొస్తాను, మీరు పగలగొట్టాలని కోరాడు ఇవాస్కా. ఎంతో చెప్పిన మీదట ముసలాయన తలూపాడు.

మర్నాడు సాయంత్రం పిల్లవాడు అతికష్టం మీద నీలం రాయిని కొండపైకి మోసుకెళ్ళాడు. ముసలాయన చెప్పిన సమయానికి వచ్చాడు.

"రాయిని పగలకొడతారా?" అనడిగాడు పిల్లవాడు.

ముసలాయన ఇలా అన్నాడు. "నేను ఇప్పుడు ఉన్నట్టే ఆనందంగా ఉన్నాను. చూడడానికి ముసలివాడిలా కనిపించినా, నా మనసు ఎంతో ఆనందంగా ఉంది. నా మొహంపై ఉన్న గాటు నేను యుద్ధంలో పాల్గొన్నప్పుడు నాకు లభించిన బహుమానం. అది నా దేశభక్తికి నిదర్శనం."

ఇది విని పిల్లవాడు ఎంతో ఆశ్చర్యపోయాడు. ప్రస్తుతం మనం ఉన్న పరిస్థితి ఎటువంటిదైనా, దాన్ని ధైర్యంగా ఎదుర్కొని జీవించాలనే సత్యాన్ని ముసలివాని మాటల ద్వారా పిల్లవాడు గ్రహించాడు.

తర్వాత చాలా మంది ఆ కొండపైన వున్న నీలంరాయిని చూశారు. కానీ ఎవ్వరూ దాన్ని పగలగొట్టలేదు.

పిల్లలూ! మీకు అలాంటి రాయి దొరికితే మీరేం చేస్తారు?


స్వేచ్ఛానువాదం : అనిల్ బత్తుల
m : 81792 73971

ఇంగ్లిష్ : ద హాట్ స్టోన్
రచయిత : అర్కాది గైదార్
ఇంగ్లీష్ అనువాదం : జాన్ బట్లర్




బాలచెలిమి జాతీయ కథల పోటీ-2025లలో విజేతలకు ప్రశంస పత్రాలను ప్రధానోపాధ్యాయులు శ్రీ ఆడెపు కరుణాకర్ గారు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను అభినందిస్తూ, సృజనాత్మక రచనల ద్వారా పిల్లలలోని ప్రతిభ మరింత వికసిస్తుందని పేర్కొన్నారు.

పండుగ






# సంపూర్ణ స్వాతంత్ర్యం
# గణతంత్ర దినోత్సవం

**తేజ:** గుడ్ మార్నింగ్ తాతయ్యా ఏదో బిజీలో వున్నట్టున్నారు?

**తాత:** మాకు ఏమి బిజి పనులుంటాయి? బిజీ పనులు మీకుంటాయి. కాని ఏమిటి విశేషం ఇలా వచ్చావు??

**తేజ:** ఏమి లేదు తాతయ్య ఈ నెలలో మనకు జాతీయ పండుగ ఒకటుందిగా?

**తాత:** ఔను "గణతంత్ర దినోత్సవం" అనే జాతీయ పండుగ వుందిగా?

**తేజ:** అదే తాతయ్యా పోయిన ఆగష్టు నెలలో మనకు స్వాతంత్ర్యం వచ్చిన సందర్భంగా స్వాతంత్ర్య దినోత్సవం చేసుకున్నాము దానికోసం త్యాగాలు చేసిన వారిని స్మరించుకుంటూ, మళ్లీ ఇప్పుడు ఇదేమిటి? గణతంత్ర దినోత్సవం! ఈ రెండు నాకు కన్ఫ్యూజ్‌గా ఉన్నాయి కాస్త అర్థమయ్యేట్టు చెప్పవా! ప్లీజ్.

**తాత:** అయితే విను మరి ఒకటి మన దేశానికి స్వేచ్ఛ వచ్చిన సందర్భంగా చేసుకునే జాతీయ పండుగ రెండు ప్రజాస్వామ్య పాలనాదేశంగా అవతరించి ప్రజలకు వచ్చిన స్వాతంత్ర్యం రాజ్యాంగబద్ధంగా పరిరక్షించబడటానికి శ్రీకారం చుట్టిన పండగరోజు.

**తేజ:** దీనినే మన రాజ్యాంగం అమలులోకి వచ్చిన రోజు అని కూడా అనవచ్చా తాతయ్యా?!

**తాత:** నిక్షేపంగా అనవచ్చు ఇక్కడ రాజ్యాంగ రచన తదితర వివరాలు గురించి నీకు ఆల్ రెడీ తెలుసు కదా?!

**తేజ:** హా... బ్రహ్మణ్ణంగా తెలుసు మా సోషల్ టీచర్ చెప్పారు.

**తాత:** సరే అయితే... ఈ సంపూర్ణ స్వాతంత్ర్య దినోత్సవం అనబడే గణతంత్ర దినోత్సవ్ ఎలా చేయాలో చెప్పుకుందామా?!

**తేజ:** దాని కన్నా ముందు అసలు దేశానికి "రాజ్యాంగం" అవసరమా?

**తాత:** మంచి ప్రశ్న అడిగావు. దీనికి సమాధానం

చెప్పడానికి ముందు మనకు పరిపాలన ఎన్ని విధాలుగా సాగుతుందో తెలుసా?

తేజ: ఆ తెలుసు ఒకసారి నువ్వే చెప్పావుగా రెండు రకాలు అవి ఒకటి రాజరిక పాలన, రెండు ప్రజాస్వామ్య పాలన.

తాత: వెరిగూడ్ బాగా గుర్తు పెట్టుకున్నావు పూర్వం మన పాలన అంతా రాజరికపాలనే దీనిలో పాలకుడైన రాజు చెప్పిన విధంగా ప్రజలు నడుచుకోవాలి ప్రజలకు అంటూ ఎలాంటి హక్కులు వుండవు అన్ని బాధ్యతలే!!

తేజ: మరి ప్రజాస్వామ్య పాలనలో...?

తాత: ప్రజలు స్వతంత్రులై కొన్ని హక్కులు కలిగి తమకు నచ్చిన పాలకులను తామే ఎంపిక చేసుకుని కొన్ని నియమాలను ఏర్పాటు చేసుకుని వాటికి అనుకూలంగా పాలించ బడతారు.

తేజ: ప్రజాస్వామ్య పాలనలో పరిపాలన నియమాలు సూచించేదే రాజ్యాంగమా? తాతయ్యని!

తాత: ఔను ప్రజాస్వామ్య ప్రభుత్వాలు సక్రమంగా నడవాలి అంటే "రాజ్యాంగం" తప్పనిసరి దానిలో చెప్పబడ్డ విధంగా కొందరిని నియమించాలి పరిపాలన సాగించాలి.

తేజ: రాష్ట్రపతి గవర్నర్ వంటి వాళ్లు కదా?!

తాత: శభాష్ బాగా చెప్పావు అందుకే ఈ గణతంత్ర దినోత్సవం సందర్భంగా దేశ రాజధానిలో రాష్ట్రపతి రాష్ట్ర రాజధాని నగరాల్లో ఆయా రాష్ట్రాల గవర్నర్‌లు జాతీయ పతాకావిష్కరణ కార్యక్రమాలు నిర్వహించే విధానం అమలులో ఉంది.

తేజ: ఔను తాతయ్య టివి వార్తల్లో చూసాను. అన్నట్టు ఈ జాతీయ పతాక ఆవిష్కరణ విధానంలో కూడా స్వాతంత్ర్య దినోత్సవానికి, గణతంత్ర దినోత్సవానికి తేడా ఏమైనా వుందా?! రెండు ఒక తీరుగానే వుంటాయా?!

తాత: చాలా చక్కని సందేహం అక్షరాల రెండు జాతీయ పర్వదినాల్లో చేసే పతాకావిష్కరణ విధానంలో తేడాలు వున్నాయి. పారతంత్ర్యం నుంచి స్వాతంత్ర్యం పొందినందుకు గుర్తుగా స్వాతంత్ర్య దినోత్సవం నాడు మడతల రూపంలో వున్న జాతీయ పతాకంను దిగువ నుంచి పైకి లాగి స్వేచ్ఛకు గుర్తుగా ఆవిష్కరణ చేస్తారు.

అదే గణతంత్ర దినోత్సవం నాడు జెండాను పైనే వుంచి ఆవిష్కరణ చేసి వందనం చేస్తారు. అంటే స్వాతంత్ర్య దినోత్సవం నాడు అమర యోధులకు గుర్తుగా జాతీయ పతానికి గౌరవ వందనం చేస్తే, గణతంత్ర దినోత్సవం నాడు మన దేశ పవిత్ర రాజ్యాంగానికి గుర్తుగా జాతీయ పతాకానికి గౌరవంగా వందనం చేస్తాము.

తేజ: దేశ రాజధానిలో రాష్ట్రపతి జాతీయ పతాకావిష్కరణ ప్రధానమంత్రి చేసిన ఎర్రకోట వద్దే చేస్తారా?!

తాత: కానే కాదు రాష్ట్రపతి భవన్ మైదానంలో ఈ కార్యక్రమం చేస్తారు. ఈ సందర్భంగా దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన సంస్కృతి - సంప్రదాయాలు ప్రతిబింబించే అలంకరణతో కూడిన శకటాలు (వాహనాలు) ప్రదర్శిస్తారు, అలాగే మన దేశ సంస్కృతి కళలతో కూడిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తూ వారం రోజుల పాటు దేశ రాజధానిలో కన్నుల పండుగగా ఈ జాతీయ పర్వదినం నిర్వహించి మన దేశ ఖ్యాతి నలు దిశలా చాటుతారు.

తేజ: మరి ఈ జెండా పండుగలో మన జాతీయ నాయకుల ఫొటోలు పెట్టాలా? పెడితే ఎవరివి పెట్టాలి?

తాత: జెండా వందనం కార్యక్రమంలో జాతీయ నాయకుల ఫొటోలు పెట్టాలని నియమం లేదు. పెట్టిన తప్పు లేదు. పెడితే సందర్భోచితంగా స్వాతంత్ర్య దినోత్సవం నాడు దానికి కారకులైన గాంధీ, సుభాష్, నెహ్రూ మొదలైనవారి ఫొటోలు. గణతంత్ర దినోత్సవం నాడు దానికి కారకులైన డా. బాబు రాజేంద్రప్రసాద్, డా॥ బి.ఆర్. అంబేద్కర్ వంటి రాజ్యాంగ నిర్మాతల ఫొటోలు పెట్టడం సముచితం.

తేజ: థాంక్యూ తాతయ్య చాలా తెలియని విషయాలు విలువైన సంగతులు చెప్పారు. బై. తాతా!!

– డా. అమ్మిన శ్రీనివాసరాజు
m : 7729883223

చరిత్ర పాఠాలు-11



# బౌద్ధ మతం - నాగార్జునుడు

బుద్ధునికి సమకాలికుడగు బావరి అనే రుషి కపిత్థవనంలో నివసించేవాడని, అతడు మగధ రాజధాని రాజగృహకు పంపిన పదహారు మంది శిష్యులు బుద్ధుని మతంలో చేరిపోయారని, వారిలో అతని మేనల్లుడు పింగియ తిరిగి వచ్చి అతనికి బౌద్ధం బోధించగా అతడు కూడా బౌద్ధమతంలో చేరిపోయాడని బౌద్ధ గ్రంథం 'సుత్తనిపాత' పేర్కొన్నది. బౌద్ధ మతానుయాయులు, వర్తకులు 'తెలివాహా' నదిని దాటి, 'ఆంధ్రనగరి'ని ప్రవేశించి అక్కడి నుండి ఆంధ్రాపథంలో బౌద్ధమతాన్ని ప్రాచుర్యంలోకి తీసుకు వచ్చారని సెరివణిజ్జ అనే బౌద్ధ జాతక కథ సూచిస్తుంది. "తెలివాహా" నదియే నేటి గోదావరి అని చాలా మంది తెలుగు పరిశోధకులు భావిస్తున్నారు. 'కపిత్థ వనం' అంటే తెలుగులో 'వెలగచెట్ల వనం' అని అర్థం. ఇక ఆంధ్రనగరి నేటి కోటిలింగాల (జగిత్యాల జిల్లా). కోటిలింగాల గోదావరి నది ఒడ్డునే ఉంది. దాని చుట్టూ గల వెలగటూరు, వెలిగేడు, వెలుగుమెట్ల మొదలగు ఊర్ల పేర్లు మరియు పాశిగామ, కోటిలింగాల, ధూళికట్ట బౌద్ధస్థూపాలు బౌద్ధ జాతక కథల వివరాలను సమన్వయం చేయడంతో శాతవాహనులకు ముందే బౌద్ధమతం తెలంగాణలో ప్రాచుర్యంలోకి వచ్చిందని చెప్పవచ్చు. క్రమంగా బౌద్ధమతం అత్యధిక ప్రజల మతం అయింది. చర్మకారులతో సహా వర్తకులు, పాటక జనం, స్త్రీలు, బాలశ్రీ వంటి శాతవాహన రాణులు బౌద్ధమతాన్ని ఆచరించారనడానికి నిదర్శనాలుగా వారు పట్టణాల్లో, రహదార్లపై నిర్మించిన స్థూపాలు, ఆరామ విహారాలు, చైత్యాలు కనిపిస్తాయి. కనుక గౌతమీపుత్ర శాతకర్ణి, అతని కుమారుడు పులుమావి, యజ్ఞశ్రీ శాతకర్ణిలకు బౌద్ధమత సంస్థలను పోషించక తప్పలేదు. రెండో బౌద్ధ సంగీతిలో బౌద్ధం (సనాతన) థేరవాద, మహాసాంఘిక శాఖలుగా విడిపోయింది. ధాన్యకటకం మొదటి నుండే మహాసాంఘిక శాఖకు కేంద్రమయింది. అమరావతీ శాసనాలు, శిల్పాల్లో చైత్యకులు (మహాసాంఘికులు) బుద్ధునికి మొదటిసారిగా లోకోత్తర గుణాలను కల్పించి, బుద్ధ చిహ్నాలైన బోధివృక్షం, త్రిరత్నం, ధర్మచక్రం, చైత్యం, సింహాసనం, పాదాలు మొదలైన వాటిని పూజించడం ప్రారంభించినట్లు తెలుస్తుంది. ఈ చైత్యకులలో పూర్వశైల (ధాన్యకటకం), అపరశైల (శ్రీపర్వతం), ఉత్తరశైల (జగ్గయ్యపేట), రాజగిరిక (గుంటుపల్లి), సిద్ధార్థక (గుడివాడ) మొదలైన శాఖలు ఏర్పడ్డాయి. ఈ మహాసాంఘిక / చైత్యక సిద్ధాంతాలు క్రమంగా ఆచార్య నాగార్జునుని కాలం నాటికి (2వ శతాబ్దం) మహాయాన బౌద్ధంగా మారాయి. ఆచార్య నాగార్జునుని జన్మస్థలం విదర్భ అని, కాంచీపురి అని, వేదలి (లంకావతార సూత్ర ప్రకారం) అని, శ్రీపర్వతం – ధాన్యకటకాల మధ్య గ్రామం (చైనా సంప్రదాయం) అని వివిధ వాదాలున్నాయి. అతడు చిన్నతనంలోనే వేదవేదాంగాలభ్యసించి, నలందా (విశ్వవిద్యాలయం ఏర్పాటు కాకముందు) మొదలైన విద్యా కేంద్రాల్లో బౌద్ధాన్ని అధ్యయనం చేసి, చివరగా శ్రీపర్వతం (నేటి నాగార్జునసాగర్)లో విశ్వవిద్యాలయాన్ని స్థాపించి దేశ విదేశాల విద్యార్థులకు అనేక విద్యలను గరిపాడని చరిత్ర. ఈయన ప్రజ్ఞాపారమిత శాస్త్ర టీకా (సంస్కృతం), మాధ్యమిక కారికా, రత్నావళి, సుహృల్లేఖ మొదలైన 24 గ్రంథాలు రాశాడు. ప్రజ్ఞాపారమిత (జ్ఞానపరిమితులు) గ్రంథం మహాయాన బౌద్ధానికి ప్రామాణిక గ్రంథం. ఇది పౌరాణిక భావనయగు 'మార్పులేదు' అనే భావానికి, బుద్ధుని 'గతితార్కిక' వాదానికి మధ్య 'మాధ్యమిక' వాదాన్ని లేదా 'తేడాలేదు' అనే శూన్యవాదాన్ని ప్రవేశపెట్టి ప్రాచుర్యంలోకి తీసుకురావడమే కాకుండా నాగార్జునుడ్ని బుద్ధుని అవతారంగా కొలిచే స్థాయికి పెంచింది. ఇతడు సుహృదయంతో తన పోషకుడు యజ్ఞశ్రీ శాతకర్ణికి రాసిన లేఖలే 'సుహృల్లేఖ'. యజ్ఞశ్రీ శ్రీపర్వతంలో 1500 (500–400–300–200–100) గదులతో 5 అంతస్థుల పారావత విహారాన్ని నాగార్జుని కోసం నిర్మించాడని, నాగార్జునుడు ధాన్యకటక మహాచైత్యానికి శిలాప్రాకారాన్ని నిర్మించాడని చైనా, టిబెటన్ యాత్రా సాహిత్యం నమోదు చేసింది. అయితే కథాసరిత్సాగరం ప్రకారం యజ్ఞశ్రీ కొడుకే నాగార్జునుని మరణానికి కారణమని, నాగార్జునుని తరువాతి పీఠాధిపతి ఆర్యదేవుడు కూడా బ్రాహ్మణుల కుట్రకే బలి అయ్యాడని తెలుస్తుంది. ఏమైనప్పటికీ భారతీయ తర్కశాస్త్రానికి నాగార్జునుడే పితామహుడనవచ్చు. ఎందుకంటే, అతను ప్రతిపాదించిన శూన్యవాదం తరువాత కాలపు ఆదిశంకరాచార్యుని 'మాయా'వాదానికి మార్గదర్శి అయ్యింది.

– డా. ద్యావనపల్లి సత్యనారాయణ
m : 9490957078



# ఊఁ.. తొందరగా

నిద్ర.. లే
పండ్లు.. తోము
మొహం.. కడుగు
సబ్బు.. రుద్దు
స్నానం.. చెయ్యి
అన్నం.. తిను
నీళ్ళు.. తాగు
బట్టలు.. తొడుగు
సంచి.. తీసుకో
చెప్పులు.. వేసుకో
అమ్మకు చెప్పు.. టాటా
నాన్నకు చెప్పు.. టాటా
బడికి వెళ్ళు.. బాగా
చదువూ.. చదువూ చాలా
చాలా.. చాలా.. బాగా..

– గంగదేవు యాదయ్య
ఉయ్యాలా జంపాలా
m : 90591 12105



# బంగారు కలలు వెండి చిరునవ్వు

మిహిరా
D/O. సుప్రజ & సతీష్
4 Yrs, ఐకే-2 (ఇంటర్నేషనల్ కిండర్‌గార్టెన్-2) / ఎల్‌కేజీ
డీఆర్ఎస్ ఇంటర్నేషనల్ స్కూల్, దూలపల్లి

క్రీడా విభాగాలు: ఈత (ఫ్రీ స్టైల్) - బంగారు పతకం, పరుగుపందెం (60 మీటర్లు) - బంగారు పతకం, అడ్డంకుల పరుగుపందెం- బంగారు పతకం, స్కేటింగ్ (50 మీటర్లు)- వెండి పతకం

ఉదయాన్నే సూర్యుడు చిరునవ్వుతో వెలుగులు చల్లుతున్నాడు. ఆ వెలుగుల మధ్య చిన్నారి తన చేతుల్లో పతకాలను పట్టుకుని నిల్చుంది. ఒక్కో పతకం ఆమె కష్టానికి, పట్టుదలకు, కలలకు సాక్ష్యంగా మెరుస్తోంది.

నీటిలోకి దూకినప్పుడల్లా ఆమె గుండె ధైర్యంతో నిండేది. ఈత పోటీలో బంగారు పతకం ఆమెను మొదటి విజేతగా నిలబెట్టింది. “నేను చేయగలను” అన్న నమ్మకం ఆమె ప్రతి ఊపిరిలోనూ కనిపించింది.

మైదానంలో పరుగెత్తినప్పుడు ఆమె అడుగులు గాలి వేగాన్ని మించాయి. రన్నింగ్‌లో బంగారు పతకం గెలిచి, లక్ష్యాన్ని చేరుకుంటే ఎంత ఆనందమో ఆమెకు అర్థమైంది.

అడ్డంకులు కనిపించినా ఆమె ఆగలేదు. ఒక్కో హర్డిల్ దాటుతుంటే భయం వెనక్కి తగ్గింది. హర్డిల్ రేస్‌లో బంగారు పతకం ఆమె ధైర్యానికి ముద్ర వేసింది.

చక్రాలపై నిలబడి జారుతూ వెళ్లినప్పుడు సమతుల్యత ఎంత ముఖ్యమో ఆమె నేర్చుకుంది. స్కేటింగ్‌లో వెండి పతకం గెలిచినా, ఆ వెండి మెరుపులో భవిష్యత్తు బంగారు కలలు మెరిసాయి.

ఆ చిన్నారి మనకు చెప్పిన సందేశం ఒక్కటే - గెలుపు పతకంలో కాదు, ప్రయత్నంలో ఉంది. క్రీడ ఏదైనా సరే, మనసు పెట్టి ఆడితే విజయం తప్పక వస్తుంది.



# ఆపిల్ పండుతో గురుత్వాకర్షణ సూత్రం

ఇంగ్లాండులో తోటలో ఒక చెట్టు కింద ఒక యువకుడు కూర్చుని దీర్ఘంగా ఆలోచిస్తున్నాడు.

ఆ యువకుడు ఐజాక్ న్యూటన్. అతడు ఆలోచించేది గ్రహాల గతుల గురించి. అది 1655వ సంవత్సరం.

గ్రీకు తత్వవేత్తలు భూమి గుండ్రంగా ఉందన్నారు. ఆకాశంలో స్థిరంగా ఉన్నదనీ, భూమి చుట్టూ సూర్యుడు, చంద్రుడు, ఇతర గ్రహాలు తిరుగుతున్నాయని చెప్పారు.

ఎందరెన్ని చెప్పినా అలా క్రమంగా ఒకదానికొకటి ఎలా తిరుగుతున్నాయో ఎవరూ నిర్ధారించి చెప్పలేక పోయారు. ఆ సమస్యను గురించే న్యూటన్ ఆలోచిస్తున్నది.

అతడు కూర్చొని ఉన్నది ఆపిల్ చెట్టు కింద. అంతలో బాగా పండిన పండొకటి చెట్టు నుండి రాలి కింద పడింది. న్యూటన్ దృష్టి ఆ పండు పైన పడింది. పండు కిందకు ఎందుకు రాలి పడింది? ఆలోచించగా ఆలోచించగా భూమి పరిమాణం కంటే పండు పరిమాణం తక్కువగా కనిపించింది. అందువల్లనే పండు కింద పడింది.

అంటే! 'ఎక్కువ ద్రవ్యమున్న వస్తువు, తక్కువ ద్రవ్యమున్న దానిని తన వైపు ఆకర్షించుకొంటుంది'. అదన్న మాట సంగతి.

అయితే! సూర్యుడిలో ద్రవ్యరాశి ఎక్కువ. ఇతర గ్రహాల్లో తక్కువ. కనుకనే సూర్యుడు గ్రహాల్ని ఆకర్షిస్తున్నాడు.

ఇకనేం! 'గ్రహాలు సూర్యుడి ఆకర్షణకు లోబడి క్రమం తప్పకుండా తిరుగుతున్నాయి.' అని 'న్యూటన్' సిద్ధాంతీకరించాడు.

ఇది చాలా మందికి నచ్చింది. నాటి నుండి 'గురుత్వాకర్షణ శక్తి'గా ఆ సిద్ధాంతంగా ప్రచారంలోకి వచ్చింది.

– 'బాల కథా సౌరభం' నుండి...

## మ్యాథ్స్ ట్రిక్స్

# 5 తో అద్భుతం




1. ఏదైనా ఒక సంఖ్యను తీసుకోమని చెప్పాలి. (సుమారు ఆరు అంకెల కన్నా ఎక్కువ ఉంటే మంచిది)
2. దానిని 5తో గుణించుకోమని చెప్పాలి.
3. ఇప్పుడు వారు తీసుకున్న సంఖ్యను చెప్పమనాలి.
4. అది విని వెంటనే వారి జవాబును చెప్పవచ్చును.

**ఉదా :** 9739457×5 = 48697285

76812948×5 = 384064740

138041150×5 = 6902085750

రహస్యం : వారు చెప్పిన సంఖ్య చివర '0' చేర్చి 2తో భాగించాలి.

97394570÷2 = 48697285

768129480÷2 = 384064740

1380411500÷2 = 6902085750

## BEAUTY NUMBER

77 X Thirteen multiplies

77 x 13 = 1001

77 x 26 = 2002

77 x 39 = 3003

77 x 52 = 4004

77 x 65 = 5005

77 x 72 = 6006

77 x 91 = 7007

77 x 104 = 8008

77 x 117 = 9009

– అంకెల మామయ్య చంద్రయ్య

m: 9440926937

## బాలచెలిమి క్లబ్

# చెలిమి క్లబ్

చెలిమిక్లబ్‌లో సభ్యత్వం తీసుకోండి లాభాలు పొందండి.

1. చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ ప్రచురించే పుస్తకాలపై ప్రత్యేక తగ్గింపు.
2. మీ ప్రతి పుట్టిన రోజుకు అభినందనలతో అందమైన గ్రీటింగ్ కార్డు.
3. మీలో ఉన్న టాలెంట్‌ను అభివృద్ధి చేసుకోవడానికి క్లబ్ నిర్మాణాత్మక సహకారం అందిస్తుంది.
4. మీ స్కూల్లో, ఊర్లో పిల్లల కార్యక్రమాల వార్తలను చెలిమి సమాచార పత్రికకు పంపడానికి మీరు విలేఖరిగా ఉండవచ్చు.
5. అందమైన మెంబర్‌షిప్ బ్యాడ్జి.
6. మిమ్మల్ని ఆశ్చర్యపరచే బహుమతులు.

**చెలిమి క్లబ్**

పేరు : ------------------

తండ్రి పేరు : ------------------

పుట్టినతేదీ : ------------------

చిరునామా : ------------------

------------------

------------------

పిన్ : ------------------

హాబీలు : ------------------


మొబైల్ : ------------------

ఇ-మెయిల్ : ------------------

ఈ వివరాలతో మెయిల్ చేయండి.

బాల చెలిమి ఇ-మెయిల్ :
desk.chelimi@gmail.com






# కృత్రిమ మేధస్సు

కృత్రిమ మేధస్సు (Artificial Intelligence - AI) వేగంగా అభివృద్ధి చెందుతున్న రంగం. ఈ అభివృద్ధిలో ముఖ్యమైన రెండు భావనలు మల్టీమోడల్ AI మరియు క్రాస్-మోడల్ AI. ఇవి AI వ్యవస్థలకు మనుషుల్లా అనేక రకాల సమాచారాన్ని గ్రహించి, విశ్లేషించి, స్పందించే సామర్థ్యాన్ని అందిస్తున్నాయి.

## 1. మల్టీమోడల్ AI (Multimodal AI) అంటే ఏమిటి?

మల్టీమోడల్ AI అనేది ఒకే సమయంలో అనేక రకాల డేటాను విశ్లేషించి, అర్థం చేసుకొని, స్పందించగల కృత్రిమ మేధస్సు వ్యవస్థ.

ఇది క్రింది డేటా రకాలతో పని చేస్తుంది:

- టెక్స్ట్ (భాష)
- చిత్రాలు (Images)
- ఆడియో (Speech / Sound)
- వీడియో
- సెన్సార్ డేటా (GPS, మోషన్, బయోమెట్రిక్స్ మొదలైనవి)
- 3D డేటా (Point Clouds, Depth Maps)

సాంప్రదాయ AI మోడల్స్ సాధారణంగా ఒకే రకమైన డేటాతో మాత్రమే పని చేసేవి (ఉదా: టెక్స్ట్ మాత్రమే).

కానీ మల్టీమోడల్ AI అనేక డేటా మోడ్‌ల మధ్య సంబంధాన్ని నేర్చుకుని సమగ్ర అవగాహనను ఏర్పరుస్తుంది.

**ఉదాహరణ**

ఒక కుక్క ఫోటో చూపించి, "ఈ చిత్రంలో ఏముంది?" అని అడిగితే - AI చిత్రం + టెక్స్ట్ రెండింటినీ కలిపి అర్థం చేసుకుని సరైన సమాధానం ఇస్తుంది.

## 2. క్రాస్-మోడల్ AI (Cross-Modal AI) అంటే ఏమిటి?

క్రాస్-మోడల్ AI అనేది ఒక డేటా మోడ్‌లోని సమాచారాన్ని మరో మోడ్‌గా మార్చు (Translate) చేయగల సామర్థ్యం.

అంటే ఇది క్రింది మార్పులు చేయగలదు:

- చిత్రం → టెక్స్ట్

- టెక్స్ట్ → చిత్రం
- వీడియో → సారాంశం
- ఆడియో → టెక్స్ట్
- టెక్స్ట్ → వీడియో
- ఆడియో → భావోద్వేగ లేబుల్

**ఉదాహరణ**

"పియానో వాయిస్తున్న పిల్లి" అని టెక్స్ట్ ఇస్తే –

AI ఆ వివరణకు సరిపడే వీడియోను రూపొందిస్తుంది.

ఒక మోడాలిటీ → మరో మోడాలిటీ మార్పు = క్రాస్-మోడల్ AI

### 3. మల్టీమోడల్ AI vs క్రాస్-మోడల్ AI (సరళ తేడా)

| అంశం | మల్టీమోడల్ AI | క్రాస్-మోడల్ AI |
|---|---|---|
| లక్ష్యం | అనేక డేటా రకాల్ని కలిసి అర్థం చేసుకోవడం | ఒక డేటా రకాన్ని మరో రకంగా మార్చడం |
| ఉదాహరణ | చిత్రం + ప్రశ్న → సమాధానం | టెక్స్ట్ → చిత్రం / వీడియో |
| వినియోగం | విజన్-లాంగ్వేజ్ మోడల్స్ | జనరేటివ్ AI (DALL·E, Diffusion Models) |

### 4. మల్టీమోడల్ & క్రాస్-మోడల్ AI ఎలా పని చేస్తాయి? (High-Level)

#### 1. Shared Embedding Space

టెక్స్ట్, చిత్రం, ఆడియో వంటి అన్ని డేటాను ఒకే గణితాత్మక స్పేస్‌లోకి మార్చి వాటి మధ్య సంబంధాన్ని నేర్చుకుంటుంది.

ఉదా: "Banana" అనే పదం మరియు అరటిపండు చిత్రం ఒ రెండింటి embeddingలు దగ్గరగా ఉంటాయి.

#### 2. Attention Mechanism (Transformers)

ఏ చిత్రం భాగం క్యాప్షన్‌కు ముఖ్యమో,
ఏ వీడియో ఫ్రేమ్ సారాంశానికి అవసరమో –
AI "Attention" ద్వారా గుర్తిస్తుంది.


#### 3. Generative Models

టెక్స్ట్ ఆధారంగా చిత్రం లేదా వీడియో రూపొందించేందుకు Diffusion Models వంటి ఆధునిక జనరేటివ్ టెక్నాలజీలు ఉపయోగిస్తాయి.

### 5. మల్టీమోడల్ & క్రాస్-మోడల్ AI - ప్రాముఖ్యమైన ఉదాహరణలు

**ఉదాహరణ 1 :**

**Vision + Language Models GPT-4o,**



**Gemini, Claude వంటి మోడల్స్:**

- చిత్రాన్ని చూసి వివరణ ఇస్తాయి
- గ్రాఫ్‌లు, చార్ట్‌లు చదువుతాయి
- ఫోటోలోని గణిత సమస్యలు పరిష్కరిస్తాయి

**ఉపయోగం:**

రెస్టారెంట్ మెనూ ఫోటో అప్‌లోడ్ చేస్తే → వెగన్ ఐటెమ్స్ సూచిస్తాయి.

**ఉదాహరణ 2 :**

**టెక్స్ట్ → చిత్రం (Cross-Modal)**

DALL·E, Midjourney, Stable Diffusion

**Input:** "సూర్యాస్తమయం సమయంలో మేఘాలపై తేలియాడే futuristic నగరం"

**Output: AI** రూపొందించిన కళాత్మక చిత్రం

**ఉదాహరణ 3 :**

**టెక్స్ట్ → వీడియో**

Runway Gen-3, Pika వంటి మోడల్స్

**Input:** "దుమ్ము తుఫాను మధ్య మంగళగ్రహంపై నడుస్తున్న రోబోటిక్ కుక్క"

**Output:** 5–10 సెకన్ల రియలిస్టిక్ వీడియో

**ఉదాహరణ 4 :**

**ఆడియో + టెక్స్ట్ (Speech AI)**

Whisper వంటి మోడల్స్:

- మాట్లాడిన మాటలను టెక్స్ట్‌గా మారుస్తాయి
- వాయిస్‌లోని భావోద్వేగాన్ని గుర్తిస్తాయి
- మీటింగ్ రికార్డింగ్‌కు సారాంశం ఇస్తాయి

**ఉదాహరణ 5 :**

**మల్టీమోడల్ మెడికల్ AI**

- CT స్కాన్లు
- డాక్టర్ నోట్స్
- పేషెంట్ వైటల్స్

ఈ అన్ని డేటాను కలిపి డయగ్నోసిస్ & రిస్క్ ప్రిడిక్షన్ చేస్తుంది. ఉదా: స్ట్రోక్ ప్రమాద అంచనా.

**ఉదాహరణ 6 :**

**మల్టీమోడల్ రోబోట్స్**

రోబోట్ ఉపయోగించే వ్యవస్థలు:

- Vision → చూడడానికి
- Language → ఆదేశాలు అర్థం చేసుకోవడానికి
- Sensors → వస్తువులతో సురక్షితంగా వ్యవహరించడానికి

ఉదా : "నీలి కప్పును డైనింగ్ టేబుల్‌పై పెట్టు" → రోబోట్ చూసి, గుర్తించి, ఎత్తి, సరైన చోట ఉంచుతుంది.

## 6. మల్టీమోడల్ & క్రాస్-మోడల్ AI వినియోగ రంగాలు

- ఆరోగ్యరంగం – వేగవంతమైన, ఖచ్చితమైన డయగ్నోసిస్
- స్వయం నడిచే వాహనాలు – కెమెరా, LIDAR, GPS డేటా ఫ్యూషన్
- సోషల్ మీడియా & కంటెంట్ క్రియేషన్ – టెక్స్ట్ → చిత్రం / వీడియో
- VR / AR - రియలిస్టిక్ 3D ప్రపంచాలు, AI అవతార్స్
- రోబోటిక్స్ & ఇండస్ట్రీ – స్మార్ట్ ఆటోమేషన్
- కస్టమర్ సపోర్ట్ – స్క్రీన్‌షాట్ → సమస్య పరిష్కారం
- విద్య – హస్తప్రతులు, వీడియోలు, వాయిస్ ఆధారంగా ఫీడ్‌బ్యాక్
- వినోదం - AI పాత్రలు, స్టోరీబోర్డ్ → వీడియో

**సారాంశ పట్టిక**

| కాన్సెప్ట్ | అర్థం | ఉదాహరణ |
|---|---|---|
| మల్టీమోడల్ AI | అనేక డేటా రకాల్ని ఒకేసారి అర్థం చేయడం | చిత్రం + ప్రశ్న→ సమాధానం |
| క్రాస్-మోడల్ AI | ఒక డేటా రకాన్ని మరో రకంగా మార్చడం | టెక్స్ట్→చిత్రం |
| కలిపిన వ్యవస్థలు | గ్రహించడం + రూపొందించడం + చర్య | చూడగలిగే, అర్థం చేసుకునే రోబోట్ |

– లత
e: ogshydcbse@gmail.com



# కలంచెలిమి



**సాగర్ల శ్రీ వర్ధన్**
7వ తరగతి
ఏకలవ్య ఫౌండేషన్ స్కూల్,
నల్లగొండ



**డి. స్నీతిక**
7వ తరగతి, జిల్లా పరిషత్ ఉన్నత
పాఠశాల, రాంపూర్,
నిజాంపేట మండలం, మెదక్ జిల్లా

**సి. హెచ్. అభిషేక్**
9వ తరగతి, తెలంగాణ మోడల్
స్కూల్, ఘన్‌పూర్ స్టేషన్, జనగాం



**తల్లెల కీర్తి**
9వ తరగతి
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల
లక్ష్మీ పూర్, ఆదిలాబాద్ జిల్లా.





**ధీరెన్ వంగా**
శ్రీరామ్ అకాడమీ,
హైదరాబాద్



**పి. ఆశీష్**
8వ తరగతి, శ్రీ స్వామి నారాయణ్
గురుకుల్ ఇంటర్నేషనల్ డే స్కూల్
చేవెళ్ల రోడ్, రంగారెడ్డి జిల్లా



# భారత స్వాతంత్ర్య సమరయోధులు

1947 ఆగస్టు 15న భారతదేశం బ్రిటిష్ పాలన నుంచి విముక్తి పొందింది. ఈ స్వాతంత్ర్యం ఒక్కరోజులో వచ్చినది కాదు. ఇది అనేక సంవత్సరాల పాటు సాగిన త్యాగాలు, పోరాటాలు, ఉద్యమాల ఫలితం. బ్రిటిష్ పాలన సమయంలో భారత ప్రజలు అనేక అన్యాయాలు, అణచివేతలు ఎదుర్కొన్నారు. మహాత్మా గాంధీ నేతృత్వంలో సహాయ నిరాకరణ ఉద్యమం, ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమం వంటి ఉద్యమాల ద్వారా గాంధీజీ ప్రపంచానికి ఆదర్శంగా నిలిచారు.

స్వాతంత్ర్య పోరాటంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్, భగత్ సింగ్, చంద్రశేఖర్ ఆజాద్, జవహర్‌లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభాయ్ పటేల్, రాజేంద్ర ప్రసాద్ ప్రముఖులు. స్వాతంత్ర్య ఉద్యమంలో మహిళల భాగస్వామ్యం కూడా విశేషమైనది. సరళాదేవి చౌధురాణి, అరుణా ఆసఫ్ అలీ, కస్తూర్బా గాంధీ, ఝాన్సీ రాణి లక్ష్మీబాయి వంటి వీరనారులు ధైర్యసాహసాలతో పోరాడి సమాజానికి ప్రేరణగా నిలిచారు. భారతదేశ స్వాతంత్ర్యం అనేది ఒక్క నాయకుడి ఫలితం కాదు. ఇది కోట్లాది మంది సాధారణ ప్రజల త్యాగాల సమష్టి ఫలితం. రైతులు, కార్మికులు, విద్యార్థులు, మహిళలు అందరూ స్వాతంత్ర్య పోరాటంలో భాగమయ్యారు.

| స్వాతంత్ర్య సమరయోధుల పేరు | సహకారాలు మరియు పాత్రలు |
|---|---|
| బాల గంగాధర్ తిలక్ | ఆధునిక భారతదేశ నిర్మాత, స్వదేశీ ఉద్యమం |
| డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ | భారత గణతంత్ర మొదటి అధ్యక్షుడు |
| లాల్ బహదూర్ శాస్త్రి | శ్వేత విప్లవం |
| హరిత విప్లవం | భారతదేశ రెండవ ప్రధానమంత్రి |
| సర్దార్ వల్లభాయ్ పటేల్ | పౌర ఉల్లంఘన ఉద్యమం మరియు క్విట్ ఇండియా ఉద్యమం భారతదేశ ఏకీకరణ |
| భగత్ సింగ్ | అత్యంత ప్రభావవంతమైన విప్లవకారులలో ఒకరు |
| సుభాష్ చంద్రబోస్ | రెండవ ప్రపంచ యుద్ధం, భారత జాతీయ కాంగ్రెస్ |
| మహాత్మా గాంధీ | జాతిపిత, దక్షిణాఫ్రికాలో పౌర హక్కుల కార్యకర్తలు, సత్యాగ్రహం, శాసనోల్లంఘన ఉద్యమం, క్విట్ ఇండియా ఉద్యమం |

| | |
|---|---|
| జవహర్‌లాల్ నెహ్రూ | భారతదేశ మొదటి ప్రధానమంత్రి |
| గోపాల కృష్ణ గోఖలే | మహాత్మా గాంధీ రాజకీయ గురువు |
| చంద్ర శేఖర్ ఆజాద్ | హిందూస్తాన్ రిపబ్లికన్ అసోసియేషన్ (HRA)ను హిందూస్తాన్ సోషలిస్ట్ రిపబ్లికన్ అసోసియేషన్ (HSRA) అనే కొత్త పేరుతో పునర్వ్యవస్థీకరించారు. |
| దాదాభాయ్ నౌరోజీ | భారత అనధికార రాయబారి |
| తాంతియా తోపే | 1857 భారత తిరుగుబాటు |
| బిపిన్ చంద్రపాల్ | విప్లవాత్మక ఆలోచనల పితామహుడు, స్వదేశీ ఉద్యమం |
| లాలా లజపతి రాయ్ | సైమన్ కమిషన్‌కు వ్యతిరేకంగా పంజాబ్ కేసరి |
| అష్ఫాకుల్లా ఖాన్ | హిందూస్తాన్ రిపబ్లికన్ అసోసియేషన్ సభ్యుడు |
| నానా సాహిబ్ | 1857 భారత తిరుగుబాటు |
| సుఖ్‌దేవ్ | HSRA (హిందూస్తాన్ సోషలిస్ట్ రిపబ్లికన్ అసోసియేషన్) పంజాబ్ యూనిట్ చీఫ్ |
| కున్వర్ సింగ్ | 1857 భారత తిరుగుబాటు |
| మంగళ్ పాండే | 1857 తిరుగుబాటు సిపాయిల తిరుగుబాటు |
| వినాయక్ దామోదర్ సావర్కర్ | హిందూ మహాసభ ప్రముఖులు మరియు హిందూ జాతీయవాద తత్వశాస్త్ర నిర్మాతలు |
| రాణి లక్ష్మీ బాయి | 1857 తిరుగుబాటులో నాయకత్వం వహించిన మహిళ |
| బేగం హజ్రత్ మహల్ | తొలి మహిళా స్వాతంత్ర్య సమరయోధురాలు |
| కస్తూర్బా గాంధీ | క్విట్ ఇండియా ఉద్యమం |
| కమలా నెహ్రూ | సహాయ నిరాకరణ ఉద్యమం, ఫోర్‌సైన్ మద్యానికి వ్యతిరేకంగా నిరసన |
| విజయ్ లక్ష్మీ పండిట్ | ఐక్యరాజ్యసమితిలో తొలి భారతీయ మహిళా రాయబారి. |
| సరోజినీ నాయుడు | ఉత్తరప్రదేశ్ గవర్నర్‌గా పని చేసిన మొదటి భారతీయ మహిళ |
| అరుణ అసఫ్ అలీ | ఇంక్విలాబ్ (మాస పత్రిక) |
| మేడమ్ భికాజీ కామా | విదేశీ గడ్డపై భారత సహాయ నిరాకరణ పతాకాన్ని ఎగురవేసిన తొలి భారతీయుడు, అమెరికాకు భారత మాత తొలి సాంస్కృతిక ప్రతినిధి' |
| కమలా చటోపాధ్యాయ | భారతదేశంలో శాసనసభకు ఎన్నికైన మొదటి మహిళ (మద్రాస్ ప్రావిన్స్) |
| సుచేతా కృపలానీ | మొదటి మహిళా ముఖ్యమంత్రి (UP) |
| అన్నీ బెసెంట్ | INC, హెూమ్ రూల్ లీగ్ యొక్క మొదటి మహిళా అధ్యక్షురాలు. |
| కిత్తూరు చెన్నమ్మ | బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేసిన మొదటి మహిళా చక్రవర్తి |
| సావిత్రిబాయి పూలే | భారతదేశంలో తొలి మహిళా ఉపాధ్యాయురాలు |
| ఉషా మెహతా | కాంగ్రెస్ రేడియోను ప్రముఖంగా నిర్వహించినది సీక్రెట్ కాంగ్రెస్ రేడియో. |
| లక్ష్మి సెహగల్ | ఇండియా డెమోక్రటిక్ ఉమెన్ అసోసియేషన్ (IDWA) (1981) |
| డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ | ఆయనను రాజ్యాంగ పితామహుడిగా పిలుస్తారు, ఆయన భారతదేశపు మొదటి న్యాయ మంత్రి |
| రాణి గైడిన్లియు | ఆమె నాగా ఆధ్యాత్మిక మరియు రాజకీయ నాయకురాలు. |
| ప్రఫుల్ల చాకి | ముజఫర్‌పూర్ హత్యలో ప్రమేయం ఉంది. |
| చిత్తరంజన్ దాస్ | బెంగాల్ నుండి సహాయ నిరాకరణ ఉద్యమంలో నాయకుడు మరియు స్వరాజ్ పార్టీ స్థాపకుడు |
| భవభూషణ్ మిత్ర | గదర్ తిరుగుబాటులో పాల్గొన్నాడు |
| అల్లూరి సీతారామ రాజు | రాంపా తిరుగుబాటు 1922-1924 |
| కన్నెగంటి హనుమంతు | పల్నాడు తిరుగుబాటు |
| పర్బతి గిరి | ఆమెను పశ్చిమ ఒరిస్సా మదర్ థెరిసా అని కూడా పిలుస్తారు. |
| తిరుపూర్ కుమరన్ | ఆయన దేశ బంధు యువజన సంఘం స్థాపకుడు. |
| కనైయాలాల్ మానేక్లాల్ మున్షి | ఆయన భారతీయ విద్యా భవన్ స్థాపకుడు |
| సేనాపతి బాపట్ | ఆయన ముల్షి సత్యాగ్రహ నాయకుడు. |
| బసావోన్ సింగ్ (సిన్హా) | లాహెూర్ కుట్ర కేసు |
| కర్తార్ సింగ్ సారాభా | లాహెూర్ కుట్ర |
| బాఘా జతిన్ | హౌరా-షిబ్పూర్ కుట్ర కేసు |
| జోగేష్ చంద్ర ఛటర్జీ | కాకోరి కుట్ర |
| రోషన్ సింగ్ | కాకోరి కుట్ర |
| పింగళి వెంకయ్య | మన జాతీయ జెండాను రూపొందించిన జెండా రూపకర్త ఆయనే. |
| వీరపాండ్య కట్టబొమ్మన్ | అతను 18వ శతాబ్దపు తమిళ అధిపతి. అతను బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ సార్వభౌమత్వాన్ని అంగీకరించడానికి నిరాకరించాడు మరియు వారిపై యుద్ధం లేవనెత్తాడు. అతను బ్రిటిష్ వారిచే బంధించబడి 1799 అక్టోబర్ 16న ఉరి తీయబడ్డాడు. |
| సచీంద్ర బక్షి | కాకోరి కుట్ర |
| రాజేంద్ర లాహిరి | కాకోరి కుట్ర |
| మన్మథ్ నాథ్ గుప్తా | కాకోరి కుట్ర |
| బహదూర్ షా జాఫర్ | 1857 భారత తిరుగుబాటు |
| చిత్రం జాతవ్ | 1857 భారత తిరుగుబాటు |
| బఖ్త్ ఖాన్ | 1857 భారత తిరుగుబాటు |

– బాలచెలిమి డెస్క్

కథ

# ఆ ఊరికి ఈ ఊరెంత దూరమో,,, ఈ ఊరికి ఆ ఊరంతే దూరం,,,



రామాపురం అనే ఊరిలో రాఘవయ్య అనే పేరున్న జమీందారు ఉండేవాడు. ఆ కుటుంబం పెద్ద బంగళాలో నివసించేది. ఇంటి నిండా పనివాళ్ళు, ఎప్పుడూ వచ్చే చుట్టాలతో ఆ ఇల్లు ఎప్పుడూ కళకళలాడుతూ ఉండేది. జమీందారు కొడుకు పేరు టింకు. వాడు ఐదో తరగతి చదివేవాడు. కానీ వాడికి కొంచెం అహంకారం ఎక్కువ. "నేను జమీందారు కొడుకును!" అని గొప్పగా చెప్పుకుంటూ, తోటి పిల్లలని లెక్క చేసేవాడు కాదు. పిల్లలందరూ కలిసి ఆడుకునేప్పుడు, టింకు వచ్చి 'నేనే కెప్టెన్, నా మాటే వినాలి!' అని గట్టిగా అరిచేవాడు. ఆటలో ఎవరైనా సరదాగా అతన్ని ఆటపట్టిస్తే, టింకు వెంటనే ఏడ్చుకుంటూ పరుగెత్తి వెళ్లి తండ్రికి ఫిర్యాదు చేసేవాడు.

జమీందారు మనుషులు వచ్చి పిల్లలను కేకలు వేసేవారు. పిల్లలు భయపడేవారు. దాంతో టింకుకు మరింత ధైర్యం వచ్చేది. వాడు ఆడిందే ఆటగా, పాడిందే పాటగా మారిపోయింది. అందరూ జమీందారుకు భయపడి ఇంట్లో కానీ, బడిలో కానీ టింకు జోలికి వెళ్లడానికి సాహసించేవారు కాదు. ఒక రోజు టింకు బడి మైదానంలోకి వెళ్లి "రండి, పరుగుపందెం ఆడుకుందాం! రండి" అని పిలిచాడు. కానీ పిల్లలంతా "మాకు హోంవర్క్ ఉంది," "మాకు టైమ్ లేదు" అని చెప్పి టింకుతో ఆడుకోవడానికి వెళ్లలేదు. అలా ఆడుకోవడానికి, మాట్లాడు కోవడానికి ఎవరూ లేక, టింకు పూర్తిగా ఒంటరివాడయ్యాడు. దాంతో టింకు బడికి వెళ్లడం మానేశాడు. ఇంట్లోనూ మౌనంగా కూర్చునేవాడు. టింకు తల్లిదండ్రులు తమ తమ పనుల్లో బిజీగా ఉండడం వల్ల గమనించలేదు.

ఒక రోజు సాయంత్రం, టింకు తన గదిలో గోడకు తల ఆన్చి ఏడుస్తూ కనిపించాడు. తల్లి వెంటనే వాడిని దగ్గరకు తీసుకుని, ప్రేమగా నిమురుతూ ఎందుకు ఏడుస్తున్నాడో తెలుసుకుంది. కొడుకు కళ్ల నీళ్లు తుడిచి, ఆ తల్లి చిరునవ్వుతో "చూడు నాన్నా, ఆ ఊరికి ఈ ఊరెంత దూరమో, ఈ ఊరికి ఆ ఊరు అంతే దూరం" అంది.

"అదేంటమ్మా, నువ్వేం చెప్తున్నావో నాకు అస్సలు అర్థం కాలేదు," అన్నాడు టింకు అయోమయంగా.

"ఇదిగో చూడు" అని తల్లి నేలమీద సుద్దముక్కతో ఒక చిన్న చుక్క పెట్టి, "ఇది శివపురం అనుకో" అంది. ఆ తర్వాత మరికొంత దూరంలో ఇంకొక చుక్క పెట్టి "ఇది రామపురం అనుకో" అని చెప్పింది. తర్వాత ఒక కొలబద్ద తీసుకుని, శివపురం నుంచి రామపురానికి దూరం ఎంత ఉందో కొలిచి చూపించింది. ఆ తర్వాత రామపురం నుంచి శివపురానికి కూడా దూరం కొలిచింది. రెండూ సమానంగా ఉన్నాయి!

"చూశావా? ఈ ఊరు నుంచి ఆ ఊరు ఎంత దూరం ఉంటుందో, ఆ ఊరు నుంచి ఈ ఊరికి కూడా అంతే దూరం ఉంటుంది. ఇది ఒక సామెత. దాని అర్థం ఏమిటంటే... మనం ఎదుటివారితో ఎలా ఉంటామో, ఎదుటివారు కూడా మనతో అలానే ఉంటారు. స్నేహం అనేది రెండు వైపులా ఉండాలి. నువ్వు అందరితో అహంకారంగా ఉండి, వారికి బాధ కలిగించావు. అందుకే నీకు అందరూ దూరమయ్యారు," అని ఆ తల్లి ప్రేమగా వివరించింది.

తల్లి మాటల్లోని లోతైన సత్యాన్ని గ్రహించిన టింకు ముఖం వెలిగింది. మరుసటి రోజు స్కూల్‌కు వెళ్లాడు. తోటి పిల్లలను నవ్వుతూ పలకరించాడు. తన దగ్గర ఉన్న పెన్సిళ్లు, రబ్బర్‌లు వారితో పంచుకున్నాడు. క్రమంగా పిల్లలు కూడా టింకుతో స్నేహపూర్వకంగా మెలుగుతూ, చక్కగా ఆటలాడుకోవడం మొదలుపెట్టారు. టింకు చదువు కూడా బాగా మెరుగుపడింది.

– కాశీ విశ్వనాథం పట్రాయుడు
m : 9494524445

# వన్యప్రాణుల మాంత్రిక రాజు సుమత్రన్ పులి



ఇండోనేషియాలోని సుమత్రా ద్వీపం, ఉష్ణమండల అడవుల భూభాగంతో ప్రసిద్ధి చెందింది. ఈ అడవుల లోతుల్లో, మన కంటికి అరుదుగా కనిపించే, కానీ పర్యావరణానికి అత్యంత కీలకమైన ఒక అద్భుతమైన జీవి నివసిస్తోంది. అది సుమత్రన్ పులి (Panthera tigris sondaica). సుండా ద్వీప పులుల ఉపజాతికి చెందిన ఈ పులి, బాలినీస్ మరియు జావాన్ పులుల వంశం పూర్తిగా అంతరించిపోయిన తర్వాత మిగిలిన ఏకైక పులి జాతిగా ఉంటుంది. ఈ అద్భుతమైన జంతువు ఇప్పుడు అడవిలో 600 కంటే తక్కువ పులులు మాత్రమే మిగిలి ఉన్నాయి, అందుకే అంతర్జాతీయ ప్రకృతి పరిరక్షణ సంఘం (IUCN) దీన్ని తీవ్ర ప్రమాదంలో ఉన్న జాతిగా గుర్తించింది. సుమత్రన్ పులి కేవలం ఒక జంతువు మాత్రమే కాదు, అది అడవుల జీవన సమతుల్యతను సూచించే నాణ్యమైన సూచిక.

ప్రపంచంలోని అన్ని పులులలో, సుమత్రన్ పులి పరిమాణంలో చిన్నది. మగ పులి సగటున 120 కిలోగ్రాములు బరువు, ఆడ పులి సుమారు 90 కిలోగ్రాముల బరువు కలిగి ఉంటుంది. మగ పులి పొడవు సుమారు 2.5 మీటర్లు, ఆడ పులి 30 సెంటీమీటర్లు తక్కువ. దాని ముదురు రంగు శరీరం మరియు సన్నని నల్ల చారలు దట్టమైన అడవులలో దాగి వేటాడటానికి సహాయపడతాయి. ప్రతి సుమత్రన్ పులికి ప్రత్యేకమైన చారల నమూనా ఉంటుంది, ఇది మన వేలిముద్రల మాదిరిగా ప్రత్యేకత. శాస్త్రవేత్తలు కెమెరా ట్రాప్‌ల ద్వారా ఈ చారల ఆధారంగా వ్యక్తులను గుర్తించి గణాంకాలు సేకరిస్తారు.

సుమత్రన్ పులులు సాధారణంగా ఒంటరిగా జీవిస్తాయి. అవి జతకట్టే సమయంలో మాత్రమే కలుస్తాయి. అడవిలో అగ్ర మాంసాహారులుగా అవి సమతుల్యతను కాపాడుతాయి. వాటి ఆహారంలో ప్రధానంగా అడవి పందులు, జింకలు ఉంటాయి. కొన్నిసార్లు కోతులు, పక్షులు, చేపలను కూడా వేటాడతాయి. ఒక అడవిలో పులి ఉండటం అంటే ఆ అడవి ఆరోగ్యంగా ఉందని అర్థం. పులులు లేకపోతే, ఆహార గొలుసులో అసమతుల్యత ఏర్పడి అడవి సమతుల్యత దెబ్బ తింటుంది.

ఆడ పులి సాధారణంగా రెండు లేదా మూడు పిల్లలకు జన్మనిస్తుంది. తల్లి తానే పిల్లలను పెంచి, వేట, ప్రమాదాల నుండి తప్పించుకోవడం, అడవిలో జీవించడం వంటి జీవన నైపుణ్యాలను నేర్పుతుంది. ఈ దీర్ఘకాల సంరక్షణ వల్ల ప్రతి పెద్ద పులి ప్రాణం ఎంతో విలువైనదిగా మారుతుంది. కానీ ఈ ప్రక్రియ పులి సంఖ్యను పటిష్టం చేయడానికి చాలా ఆలస్యంగా ఉంటుంది. అందుకే ప్రతి పెద్ద పులి ప్రాణం, ముఖ్యంగా ఆడ పులి ప్రాణం, ఆవిష్కరణాత్మకంగా ఉంటుంది.

సుమత్రన్ పులుల మనుగడకు ప్రధాన సమస్యలు అక్రమ వేట, అడవుల నరికివేత, వ్యవసాయం మరియు అభివృద్ధి పనుల కారణంగా ఆవాస నష్టం, అలాగే మనుషులతో ఘర్షణల తరువాత జరిగే ప్రతీకార హత్యలు. ఈ కారణాల వల్ల పులుల నివాస ప్రాంతాలు విడిపోతున్నాయి, జనాభా మరింత తగ్గిపోతుంది, పునరుత్పత్తి సామర్థ్యం తగ్గిపోతుంది.

సుమత్రన్ పులిని రక్షించడం కేవలం ఒక జంతువును కాపాడడం కాదు. అది ఒక సంపూర్ణ అడవి వ్యవస్థ, అనేక వృక్షజాలం మరియు జీవజాలాన్ని కాపాడటం. పులి ఉన్న అడవి ఆరోగ్యంగా ఉంటుంది, అడవి ఆరోగ్యంగా ఉంటే భూమి ఆరోగ్యంగా ఉంటుంది. సుమత్రన్ పులి ప్రకృతి ఇచ్చిన ఒక అపూర్వమైన వరం. అది అడవుల గర్జన మాత్రమే కాదు, అడవుల జీవనాధారం కూడా. మన బాధ్యత ఏమిటంటే, ఈ అద్భుత జీవి భవిష్యత్తు తరాలకు కూడా జీవించి ఉండేలా చూడటం. పులిని కాపాడితే అడవిని కాపాడినట్లే, అడవిని కాపాడితే జీవనాన్ని కాపాడినట్లే.

– సచిన్ కోత్వాల్

బాలచెలిమి గ్రంథాలయం

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, దాట్ల

# దాట్ల హైస్కూల్‌లో బాలచెలిమి గ్రంథాలయ ప్రారంభం






మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, దాట్లలో బాలచెలిమి గ్రంథాలయాన్ని అంగరంగ వైభవంగా ప్రారంభించారు. గ్రామ సర్పంచ్ కొమ్మినేని మంజుల, ఉపసర్పంచ్ మిడతపల్లి మధు, వార్డు సభ్యులు, గ్రామ పెద్దల చేతుల మీదుగా ఈ గ్రంథాలయాన్ని ప్రారంభించడం జరిగింది. బాలచెలిమి సంపాదకులు ఎం. వేదకుమార్ మణికొండ గారు రూ. 40,000లతో ఈ గ్రంథాలయాన్ని మంజూరు చేయడం విశేషం. ఈ సందర్భంగా సర్పంచ్ కొమ్మినేని మంజుల మాట్లాడుతూ, పుస్తక పఠనం విద్యార్థుల జీవితాల్లో కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. పుస్తకాలు చదవడం వల్ల జ్ఞానం పెరగడమే కాకుండా, విలువలతో కూడిన జీవన విధానం అలవడుతుందని తెలిపారు. భవిష్యత్తులో ఉద్యోగాలు సాధించడానికి అవసరమైన ఆలోచనా శక్తి, నిర్ణయ సామర్థ్యం, ఇతరులతో ఎలా మెలగాలో చెప్పే సామాజిక నైపుణ్యాలు కూడా గ్రంథాల ద్వారా పెరుగుతాయని అన్నారు. అలాగే విద్యార్థుల్లో ఊహాశక్తి విస్తరించి, సృజనాత్మకత వికసిస్తుందని పేర్కొన్నారు.

ఈ గ్రంథాలయాన్ని కేవలం పాఠశాల విద్యార్థులే కాకుండా గ్రామంలోని ఇతర విద్యార్థులు కూడా సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు చదువులో ముందుకు వచ్చి, ఉన్నత విద్యను అభ్యసించి, సమాజంలో ఉన్నత స్థానాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ దిశగా బాలచెలిమి గ్రంథాలయం ఎంతో ఉపయోగకరంగా నిలుస్తుందని అన్నారు. విద్యార్థులను చదువు, రచనల వైపు ప్రోత్సహిస్తూ, వారిలో సాహిత్య ఆసక్తిని పెంపొందిస్తున్న ప్రధానోపాధ్యాయులు కొమ్మవరపు కృష్ణయ్యను ఈ సందర్భంగా సర్పంచ్ ప్రత్యేకంగా అభినందించారు. అలాగే విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్న ఉపాధ్యాయ బృందాన్ని కూడా ప్రశంసించారు. రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా మంజూరైన 20 బాలచెలిమి గ్రంథాలయాలలో వరంగల్, మహబూబాబాద్ జిల్లాలకు చెందిన పాఠశాలలలో భాగంగా దాట్ల హైస్కూల్‌కు ఈ గ్రంథాలయం అందడం గ్రామానికి గర్వకారణమని గ్రామ పెద్దలు తెలిపారు. ఈ కార్యక్రమానికి సహకరించిన ఎం. వేదకుమార్ మణికొండ గారికి గ్రామ ప్రజల తరపున హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. బాలచెలిమి గ్రంథాలయం ద్వారా విద్యార్థుల్లో పఠన సంస్కృతి మరింత బలపడుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

– కె. కృష్ణయ్య
ఖమ్మం
m : 94406 71251



# కన్నుల పండుగలా జరిగిన బాలచెలిమి జాతీయ కథల పోటీ విజేతలకు బహుమతీ ప్రదానం

చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ, బాలచెలిమి నిర్వహించిన జాతీయ కథల పోటీలో ఉత్తమ కథలుగా ఎంపికైన విజేతలకు బహుమతీ ప్రదాన సభ డిసెంబర్ 22 ఉదయం ఆక్స్‌ఫర్డ్ స్కూలులో బాలచెలిమి సంపాదకులు మణికొండ వేదకుమార్ అధ్యక్షతన జరిగింది. ప్రత్యేక ఆహ్వానితులుగా తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మెన్ డా. రియాజ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రంథాలయ కార్యదర్శి రావి శారద, ఆత్మీయ అతిథులుగా ఉస్మానియా యూనివర్సిటీ తెలుగు శాఖ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా॥ ఎస్. రఘు, చిత్రకారులు కూరెళ్ళ శ్రీనివాస్, ధనుంజయ, మాడభూషి లలితా దేవి గార్లను బాలచెలిమి కన్వీనర్ గరిపెల్లి అశోక్‌గారు వేదిక పైకి ఆహ్వానించి సభను చివరి వరకు నిర్విఘ్నంగా నిర్వహించారు. సభకు అధ్యక్షత వహించిన వేదకుమార్ గారు మాట్లాడుతూ బాలసాహిత్య అభివృద్ధికి చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ చేసిన కృషి వివరించారు. బాలచెలిమి ముచ్చట్ల నుండి బాలచెలిమి పత్రిక, బాల చెలిమి గ్రంథాలయాల ఏర్పాటు వరకు జరిగిన కృషిని వివరించారు. 2020 నవంబర్ 19న మొదటి బాలచెలిమి గ్రంథాలయాన్ని పోచంపల్లిలో ఏర్పాటు చేసామని ఇప్పటి వరకు 21 గ్రంథాలయాలను ఏర్పాటు చేసామని ఈ రోజు మరో 20 గ్రంథాలయాలను ప్రారంభిస్తున్నామని అన్నారు. కరోనా సమయంలో కూడా మాస్కులు ధరించి గ్రంథాలయాలను ఉపయోగించుకున్న చిన్నారులను, ఉపాధ్యాయులను అభినందించారు. అలాగే కథల పోటీలో పాల్గొన్న పిల్లలకు, పెద్దలకు, యువతకు, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు అభినందనలు తెలియజేసారు. బొమ్మలు వేసిన చిత్రకారులకు, న్యాయనిర్ణేతలకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ప్రేమపూర్వక ధన్యవాదాలు చెప్పారు. ఇక ముందు కూడా ఇలాగే కలిసి పని చేద్దామని చెప్పారు.

రావి శారదగారు మాట్లాడుతూ పుస్తకాలను ప్రేమించి, చదివించి, రాయించడం గొప్ప విషయమని, పిల్లలకు చదివే అలవాటు వల్ల వారిలో సృజనాత్మకత పెరుగుతుందని పద సంపద పెరుగుతుందనీ అన్నారు.

డా॥ రియాజ్ గారు మాట్లాడుతూ పిల్లలలో మూఢవిశ్వాసాలు కాక శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంచాలని, హేతువాద దృక్పథం వ్యక్తులను మానవతావాదులుగా మారుస్తుందని, బాలచెలిమి చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. బాలచెలిమికి ఆత్మీయమిత్రులు, శ్రేయోభిలాషి డా. రఘు మాట్లాడుతూ పిల్లల కోసం వేదకుమార్ గారు కృషిని శ్లాఘించారు. నేటి బాలల్ని రేపటి రచయితలుగా తీర్చిదిద్దుతున్నారని అభినందించారు. చిత్రకారులు కూరెళ్ళ శ్రీనివాస్ గారు మాట్లాడుతూ బాలచెలిమికి తనకు గల ఆత్మీయ సంబంధాన్ని గుర్తు చేసుకున్నారు. కథలకు బొమ్మలు వేడంలోని సాధక బాధకాలను వివరించారు. పిల్లల స్థాయిలో ఆలోచించి బొమ్మలు వేస్తామని చెప్పారు.


మాడభూషి లలితా దేవిగారు మాట్లాడుతూ తెలుగు భాషాభివృద్ధికి బాలసాహిత్యం ఎంతగానో తోడ్పడుతుందనీ, బాలబాలికలకు కార్యశాలలు నిర్వహించి, ఎక్కువ సంఖ్యలో పోటీలు నిర్వహించి ప్రోత్సహించాలన్నారు. సభా ప్రారంభానికి ముందు డా॥ పైడిమర్రి గిరిజ గారు మాట్లాడుతూ బాలల కథలు ఎంతో ఆలోచనాత్మకంగా ఉన్నాయని, కథలతో పాటు పద్యాలు రాయడం సంతోషంగా ఉందని, పిల్లల పుస్తకాలు ఇతర భాషల్లోకి అనువాదం కావడం అభినందనీయమన్నారు. తడకపాత గ్రంథాలయ నిర్వాహకులు ప్రవీణశర్మగా మాట్లాడుతూ బాలచెలిమి గ్రంథాలయం వల్ల 14 పుస్తకాలు ప్రచురించడం జరిగిందని అన్నారు. ప్రధానోపాధ్యాయులు కొమ్మవరపు కృష్ణయ్య గారు మాట్లాడుతూ మా పాఠశాలలో 490 మంది విద్యార్థులకు బాలచెలిమి గ్రంథాలయం ఎంతగానో ఉపయోగపడిందన్నారు.

పోటీలో ఎంపికైన రచయితలకు, చిత్రకారులకు, న్యాయనిర్ణేతలకు, డా॥ రియాజ్, రావి శారద, డా॥ రఘు గార్ల చేతుల మీదుగా సత్కారాలు ఘనంగా జరిగాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు కన్నుల పండుగలా చాలా ఆత్మీయంగా కార్యక్రమం జరిగింది.

– గరిపెల్లి అశోక్









# సృజనకారుల మధ్య బాలచెలిమి జాతీయ కథల పోటీలో ఎంపికైన కథల సంపుటాలు ఎనిమిది ఆవిష్కరణ

బాలచెలిమి జాతీయ కథల పోటీలు మూడు విభాగాలుగా పిల్లలు రాసిన పిల్లల కథలు, పెద్దలు రాసిన పిల్లల కథలు, యువత రాసిన పిల్లల కథలుగా నిర్వహించింది. ఎంపికైన ఉత్తమ కథలను పిల్లలవి నాలుగు, పెద్దవాళ్ళవి మూడు, యువతది ఒకటి – మొత్తం ఎనిమిది సంపుటాలను ప్రచురించింది.

ఈ పుస్తకాలను 23 డిసెంబర్ 2025 సాయంత్రం హైద్రబాద్ బుక్‌ఫెయిర్‌లో బాలచెలిమి సంపాదకులు మణికొండ వేదకుమార్ అధ్యక్షతన జరిగిన సభలో శాంతా సిన్హా, ఏనుగు నరసింహారెడ్డి గార్లు ఆవిష్కరించారు.

వేదకుమార్ మాట్లాడుతూ చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ కృషిని, కథల పోటీ వివరాలను, గ్రంథాలయ ఏర్పాట్లను వివరించారు.

శాంతా సిన్హా మాట్లాడుతూ సోషల్ మీడియాకు పోటీగా బాల సాహిత్యం విరివిగా రావడం అభినందనీయ మన్నారు.

ఏనుగు నరసింహారెడ్డి గారి మాట్లాడుతూ ఒకప్పటికంటె ఈ రోజు బాల సాహిత్యం విరివిగా వస్తుందని, కథా వస్తువులో, చెప్పే తీరులో మార్పు రావలసి ఉందన్నారు.

డా॥ రఘు మాట్లాడుతూ 8 సంపుటాలు మూడు తరాలకు సారథ్యం వహిస్తున్నాయన్నారు.


ఈ సభలో బాలాచారి, బుక్‌ఫెయిర్ సొసైటీ అధ్యక్షులు యాకూబ్ పాల్గొన్నారు. బాలసాహితీవేత్తలు, కథల పోటీలో సహకరించిన వి.ఆర్. శర్మ, చొక్కాపు వెంకట రమణ, రాపోలు సుదర్శన్ గార్లను సత్కరించారు.

ఈ సభలో జుగాష్ విలి, నీరజ అమరవాది, పైడిమర్రి గిరిజ, సయ్యద్ ఖైజర్ తదితరులు పాల్గొన్నారు. బాలచెలిమి కన్వీనర్ గరిపెల్లి అశోక్ సభను పర్యవేక్షించారు.

– గరిపెల్లి అశోక్

# న్యాయపతి రాఘవరావు

న్యాయపతి రాఘవరావు రేడియో అన్నయ్యగా ప్రసిద్ధుడు, ఆంధ్ర బాలానంద సంఘం సంస్థాపకుడు, బాల సాహిత్యవేత్త, బాల బాలికల శ్రేయస్సు, సాంస్కృతిక వికాసానికి తన జీవితాన్ని అంకితం చేసిన విద్యావేత్త, కళాకోవిదుడు, రచయిత. ఈయన 1905వ సంవత్సరం ఏప్రిల్ 13న ఒరిస్సాలోని బరంపురంలో జన్మించాడు. తండ్రి న్యాయపతి రామానుజస్వామి ప్రముఖ న్యాయవాది. పాఠశాల చదువు అనంతరం విజయనగరంలోని మహారాజ కళాశాలలో డిగ్రీ పూర్తి చేసాడు. 1934లో కామేశ్వరితో పెళ్ళయింది. రేడియో అక్కయ్యగా ప్రఖ్యాతిగాంచిన న్యాయపతి కామేశ్వరి ఈమెయే. రాఘవరావుకి బాల్యం నుంచి పిల్లలంటే ప్రాణం. వారికి కథలు చెప్పటమన్నా, నటించి చూపటమన్నా మహా ఇష్టం. పాఠశాలలో వక్తృత్వ పోటీల్లో కథలు చెప్పే పోటీల్లో ప్రథమ బహుమతులన్నీ అతని సొత్తే.



ఈయన డిగ్రీ అయ్యాక, మద్రాసులో ది హిందూ పత్రికలో విలేఖరిగా జీవితం ప్రారంభించాడు. పది సంవత్సరాల తరవాత, దానికి రాజీనామా చేసి. ఆకాశవాణిలో కాంట్రాక్టు పద్ధతిపై చేరారు. ఆ రోజుల్లో బీ.బీ.సీ లోని పిల్లల కార్యక్రామాల తరహాలో మన దేశంలో కూడ చిన్న పిల్లల కొరకు రేడియో ప్రసారాలను ఆరంభించాలని అప్పటి ప్రభుత్వం జాతీయ స్థాయిలో ఒక నిర్ణయం తీసుకుంది. మద్రాసు రేడియోలో పిల్లల కార్యక్రమాలను దుర్గాబాయి దేశముఖ్ నిర్వహించేవారు. 1933లో రాఘవరావు, కామేశ్వరి జంటకు ఆ అవకాశం లభించింది. అక్కడ చేరిన తరువాత చిన్నపిల్లల కార్యక్రమాలను ప్రతి వారం నిర్వహించే పద్ధతిని ప్రవేశ పెట్టారు. ఈ కార్యక్రమం నిర్వహిస్తూ క్రమంగా రాఘవరావు రేడియో అన్నయ్యగా పేరొందారు. ప్రతి ఆదివారం ఆటవిడుపు అనే కార్యక్రమం ప్రారంభించి, తెలుగు బాల బాలికలను రారండోయ్ రారండోయ్... పిల్లల్లారా రారండోయ్ అంటూ పిలుపు నిచ్చారు. ఆయనకు చేదోడు వాదోడుగా ఆయన శ్రీమతి న్యాయపతి కామేశ్వరి అండగా నిలిచి ఆ కార్యక్రమాలను విజయవంతం చేసి రేడియో అక్కయ్యగా పేరొందారు. రేడియోలో పనిని వారు ఉద్యోగంగా కాకుండా ఒక ఉద్యమంగా భావించారు.

ఆటవిడుపు కార్యక్రమానికి శ్రోతల సంఖ్య విపరీతంగా పెరిగిపోయింది. దాంతోపాటే ఆ కార్యక్రమంలో పాల్గొనే పిల్లల సంఖ్య కూడా ఎక్కువ కావటంతో పది సంవత్సరాల లోపు పిల్లలకి శనివారం బాలానందం అనీ, పది సంవత్సరాలు పైబడిన వారికి మరో కార్యక్రమం పెట్టి బాలబాలికల సృజనాత్మక శక్తిని పెంపొందించే ప్రయత్నంలో ఈ రేడియో అన్నయ్య ఎంతో కృషి చేశారు. వారిని ఒడిలో కూర్చోపెట్టుకుని లాలించి, ముద్దాడి, ముద్దు ముద్దు పాటలు పాడిస్తూ, వారి పాటలకు అనుగుణంగా నోటితో రకరకాల ధ్వనులను చేస్తూ మధ్య మధ్యలో అగ్గిపెట్టితో చిత్రవిచిత్ర ధ్వనులు చేస్తూ ఆ కార్యక్రమం వింటున్న వారికి గిలిగింతలు పెట్టేవారు. వాస్తవానికి ఆ కార్యక్రమం కోసం పిల్లలకన్నా పెద్దలే ఆతృతగా వేచి చూసేవారు. రేడియో అన్నయ్య స్థాపించిన ఆంధ్ర బాలానంద సంఘం విజయభేరి మ్రోగించింది. 1956లో హైదరాబాదులో బ్రాంచి కూడా వెలిసింది. అనంతరం ఈ విషయం గ్రహించి బాలబాలికల పత్రికల సంఘాల అవశ్యకతను గుర్తించి అనేక బాలానంద సంఘాలు ఏర్పడ్డాయి. బాల పత్రికలు ఎన్నో వెలిశాయి. జవహర్ బాలభవన్ (1966), ఆంధ్రప్రదేశ్ బాలల అకాడమీ (1976) స్థాపనకు ఆయన విశేషమైన కృషి చేశాడు. ఆ సంఘంలో అనేక చక్కని కార్యక్రమాలు ఇప్పటికీ జరుగుతున్నాయి. సంగీతం, నాట్యం, నాటకం, మేజిక్, హిప్నాటిజం రంగాల్లో కూడా శిక్షణనిస్తూ అదొక బాలల దైవ మందిరంగా అలరారుతోంది.

బాలబాలికల ప్రగతికై పాటుబడిన న్యాయపతి రాఘవరావుకు సంతానం లేదు. రేడియో అన్నయ్య, అక్కయ్యల లక్షల ఆస్తిని ఆంధ్ర బాల బాలికలకే ధారాదత్తం చేశారు. బాలబాలికల ఆటపాటలకు, సహజమైన వాళ్ళ కళాకౌశలానికి ప్రోత్సాహం అందించే వేదిక ఉండాలన్న ఆయన ఆశయానికి రూపకల్పనయే ప్రభుత్వం స్థాపించిన బాలల అకాడమీ.

బాలానందం రేడియో అన్నయ్య 1984 ఫిబ్రవరి 24న స్వర్గస్థులైనారు.

- సువేగా

# CENTRAL BOOK SHOP

**ABIDS**
5-9-186,Behind SBH(H.O)
Gunfoundry,Hyd-1.
Ph: 66468646,23203108

**AMEERPET**
Lane Opp.Green Park Hotel,
Hyderabad.
Ph: 2340 0789

CBS Global Service
CENTRAL BOOK SHOP
ABIDS / AMEERPET

- SCHOOL BOOKS
- GENERAL BOOKS
- STATIONARY & GIFTS





Printed at : Deccan Press, Azamabad, Hyderabad-20, Ph : 90599 50055

**BALA CHELIMI,** Telugu Children's Monthly Magazine
Date of Publication: 23rd Every Month
Postal Dates: 24th & 26th Every Month
Posting at BPC IV, Patrika Channel, Nampally, Hyderabad-500001.

RNI Regn. No. 52828/1992 TC No. TELTEL01232
Postal Regn.No.HCD-5022/2024-2026

# చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ
హైదరాబాద్ (Regd. 720/1982)

బాల చెలిమి
పిల్లల వికాస పత్రిక

## ప్రచురణలు

**38 పుస్తకాల ధర రూ.1630 • తగ్గింపు ధర రూ. 1450**

### తెలంగాణ బడి పిల్లల కథలు
10 పుస్తకాల సెట్ ధర రూ.330 తగ్గింపు ధర రూ. 300



### పెద్దలు రాసిన పిల్లల కథలు (ఉమ్మడి పది జిల్లాలు)
10 పుస్తకాల సెట్ ధర రూ.350 • తగ్గింపు ధర రూ. 300



### చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ ప్రచురించిన ఇతర పుస్తకాలు
18 పుస్తకాల ధర రూ.950 • తగ్గింపు ధర రూ. 850



పిల్లలకు అత్యంత ఆనందానిచ్చేది ఆట బొమ్మలు, కథల పుస్తకాలే. పాఠ్యపుస్తకాలు అందించే జ్ఞానానికి సమాంతరంగా మరెంతో లోకజ్ఞానాన్ని అందించేది బాల సాహిత్యమే. పుస్తకాలు పిల్లల ఆలోచనా నైపుణ్యాలను పెంచుతాయి. వారి ఊహలకు ప్రాణం పోస్తాయి. వారిలో సృజనాత్మకతను పెంచుతాయి. చరిత్ర, సంస్కృతి, కళలు, సైన్స్, మానవ స్వభావాలు, జంతు స్వభావాలు, ఆరోగ్య సంబంధిత అంశాలు - ఒకటేమిటి ప్రాథమిక విజ్ఞానఖని బాలసాహిత్యం, పిల్లలో నైతికతను, ఆధ్యాత్మికతను, సక్రమమైన ప్రవర్తనను, మంచి చెడుల అవగాహనను పెంచే బాధ్యతను బాలసాహిత్యమే నెరవేర్చగలదు.

-మణికొండ వేదకుమార్
చైర్మన్, చిల్డ్రన్స్ ఎడ్యుకేషన్ అకాడమీ

**Account Details :**
Account Name : Bala Chelimi
Bank Name : Canara Bank
A/c. No. : 30101010003714
Branch : Ashoknagar, Hyderabad.
IFSC Code : CNRB0013010

ప్రతులకు
అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలు. మరియు
'భూపతి సదన్' 3-6-716, స్ట్రీట్ నెం.12,
హిమాయత్‌నగర్, హైదరాబాద్-500029
ఫోన్ : 9030 6262 88
email: edit.chelimi@gmail.com website : www.balachelimi.com

SCAN & PAY

Printed at : Deccan Press, Azamabad, Hyderabad-20, Ph : 90599 50055

Edited, printed, published and owned by Manikonda Vedakumar,
Printed at Deccan Press, H.No.1-9-1126/B, Azamabad, Musheerabad, Hyderabad-500020, Telangana State.
Published at "CHANDRAM", # 3-6-712/2, 12th Street, Himayatnagar, Hyderabad-500029, Telangana.
Editor: Manikonda Vedakumar. RNI Reg No. 52828/92, Tc No: TEL Tel01232.
Cell : 9030626288, Mail ID : edit.chelimi@gmail.com